## ప్రజల అతి విశ్వాసంతోనే వరదలు



- కామారెడ్డి ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు
- ఓటువేశామని.. కడగాలంటే కుదరదు
- ప్రజాతప్పిదం వల్లే కామారెడ్డికి దుస్థితి

02


## బాలయ్య పెద్దమనసు



- సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షలు విరాళం

02

## అసెంబ్లీకి రాని కేసీఆర్ రాజీనామా చేయాలి



- ఆయన అసెంబ్లీకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్లే
- కాళేశ్వరంలో లక్ష కోట్లు తిన్న వాళ్లను ఊరికే వదిలేస్తామా?
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాట్ కామెంట్స్

02

ANN తెలుగు

Follow: @ANNTELUGU

31-08-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 267 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## వరదల్లో ప్రజలు.. నిందల్లో నేతలు


అసాధరణ వర్షాలు ఉత్తర తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఇంకా ముప్పు పొంచి ఉంది. ఈ సమయంలో రాజకీయాలు పక్కనపెట్టి బాధితులకు బాసటగా నిలవాల్సిన అవసరం నాయకులపై ఉంది. ప్రజలు బాధల్లో ఉంటే.. నేతలు విమర్శలు, నిందల్లో కాలంగడిపే పంథాను ప్రజలు హర్షించరు. తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య కాళేశ్వర రాజకీయం సాగుతుండగా, ఏపీలో ఐటీ విస్తరిస్తోంది. ఐబీఎం తమ క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్ ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ట్రంప్ టారిఫ్ లతో అమెరికాకే కొత్త చిక్కులురాగా, భారత్ చైనా రష్యా మైత్రి ఆర్థిక వృద్ధిపై కొత్త ఆశలు కలిగిస్తోంది.

- తాజా రాజకీయాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో

## తెలంగాణ మంత్రివర్గంలోకి
# అజారుద్దీన్?

### జూబ్లీహిల్స్ షెడ్యూల్‌కు ముందే ఇచ్చే ఛాన్స్



**ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్**

**గవర్నర్ కోటాలో పంపాలని కేబినెట్ నిర్ణయం**

**అనూహ్య ఎంపిక వెనుక పక్కా లెక్కలు..**

**బీహార్ లో మంత్రి హోదాలో ప్రచారం చేయనున్న అజారుద్దీన్?**

**హైదరాబాద్, మహా :** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాంతో పాటు అజారుద్దీన్ కు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించడం వెనుక అనూహ్యవ్యూహం కనబడుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న అజారుద్దీన్ ను అనూహ్యంగా శాసనమండలికి పంపించాలన్న కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. ఈమేరకు శనివారం కేబినెట్ భేటీలో ఆమోదించింది. ఇటీవల సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకలను అజారుద్దీన్ కలిసి రాగా.. ఆ తర్వాత లెక్కలు ఫటాఫట్ మారిపోయాయి. జూబ్లిహిల్స్ లో సర్వేలు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని.. బలమైన బీసీ నేతకు టికెట్, మైనారిటీ నేతకు ఎమ్మెల్సీ ఇవ్వాలని డిసైడ్ అయింది. ఈ క్రమంలో అజారుద్దీన్ కు ఎమ్మెల్సీతో పాటు డబుల్ బోనస్ దక్కబోతున్నది.

### అజారుద్దీన్ ప్రమాణం అపుడే..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా పార్టీ తరపున మైనార్టీ నేతలెవరూ ఎమ్మెల్యేలుగా గెలవకపోవడంతో కేబినెట్ లో ఆ వర్గానికి స్థానం దక్కలేదు.

మిగతా 2లో



## నవీన్ యాదవ్‌కే జూబ్లీహిల్స్?

### కాంగ్రెస్ హైకమాండ్ డిసైడ్

**బీసీలకే ఇవ్వాలని నిర్ణయం**

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిపై స్పష్టత వచ్చింది. బీసీకే ఇవ్వాలన్న టీపీసీసీ నిర్ణయానికి కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సర్వేలలో నవీన్ యాదవ్ ముందంజలో నిలవడం, స్థానికంగా నవీన్ యాదవ్ కు, ఆయన కుటుంబానికి గట్టి పట్టు ఉండడంతో కాంగ్రెస్ పెద్దలు అటువైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

మిగతా 2లో

## గణపతి బప్ప మోరియా కావాలయ్యా యూరియా

### కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

**ఖాళీ యూరియా బ్యాగులతో ఆందోళన**

**సెక్రటేరియట్ ముట్టడి.. వ్యవసాయ కమిషనరేట్ ముందు నిరసన**



**హైదరాబాద్, మహా:** గణపతి బప్పా మోరియా.. కావాలయ్యా యూరియా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శనివారం మెరుపు ఆందోళనలకు దిగారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో వరద నష్టంపై చర్చించాలని, యూరియా సమస్యపై చర్చించాలని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ తర్వాత అక్కడి నుండి వ్యవసాయ కమిషనరేట్ వరకు ప్లేకార్డులు చేతబట్టి ప్రదర్శన నిర్వహించారు. రైతు సమస్యలు, పంట నష్టం, యూరియా కొరతపై వ్యవసాయశాఖ కమిషనర్‌కు బీఆర్ ఎస్ నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ముందు కూర్చొని ఆందోళనకు దిగారు.

మిగతా 2లో

## పంచాయతీ ఎన్నికలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- **బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదం**
- **వరదలతో జరిగిన నష్టానికి నిధుల మంజూరు**
- **వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే ఉత్కంఠకు రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది.

మిగతా 2లో

## వరద బాధితులకు కంది భరోసా

### ఆదిలాబాద్ రూరల్ మండలంలో విస్తృత పర్యటన

పంట నష్టపోయిన రైతులు ఆందోళ చెందొద్దు

అధికార యంత్రాంగం రైతులకు అండగా నిలవాలి

ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి



**ఆదిలాబాద్ మహా :** వరద బాధిత ప్రాంతాల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి పర్యటించారు. అకాల వర్షాలు, వరదలతో పంట ,ఇండ్లు నష్టపోయిన బాదితులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలో ఆయన పర్యటించారు. పిప్పల్ దరి ,సాలెగూడ, శివగూడ, లింగుగూడ, మామిడిగూడ,అంకోలీ గ్రామాలలోని వరద ప్రభావిత ప్రాంతాలలో తిరిగి రైతులను ప్రజలను ఓదార్చారు.

మిగతా 5లో



## పేదలకు ఎర్రజెండా ఓ నమ్మకం

- కమ్యూనిస్టులు తలచుకుంటే ప్రభుత్వాలు దిగిపోతాయి
- కమ్యూనిజం అంటే లైబ్రరీ పుస్తకం కాదు.. ప్రజల పక్షాన పోరాడే చైతన్యం
- ప్రస్తుతమున్న విపత్కర పరిస్థితుల్లో విపక్షాలన్నీ ఏకమవ్వాలి
- సురవరం సుధాకర్ రెడ్డి పేరు చరిత్రలో నిలిచిపోయేల నిర్ణయం తీసుకుంటాం
- కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,03,310 |
| 22 క్యారెట్ | 94,700 |
| సిల్వర్ (కేజీ) | 1,19,900 |



# పేదలకు ఎర్రజెండా ఓ నమ్మకం

## కమ్యూనిస్టులు తలచుకుంటే ప్రభుత్వాలు దిగిపోతాయి

- కమ్యూనిజం అంటే లైబ్రరీ పుస్తకం కాదు.. ప్రజల పక్షాన పోరాడే చైతన్యం
- ప్రస్తుతమున్న విపత్కర పరిస్థితుల్లో విపక్షాలన్నీ ఏకమవ్వాలి
- సురవరం సుధాకర్ రెడ్డి పేరు చరిత్రలో నిలిచిపోయేల నిర్ణయం తీసుకుంటాం
- కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పని చేసిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పేరు చరిత్రలో శాశ్వతంగా ఉండే విధంగా రాష్ట్ర మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. సిద్ధాంతాలు చెప్పడమే కాదు. నమ్మిన సిద్ధాంతం కోసం 65 సంవత్సరాలు నిబద్ధతతో జీవించడం ద్వారా సురవరంకు ఆ గౌరవం దక్కిందని అన్నారు. వారు ఏ జెండాను మోశారో, ఏ జెండా మోయడం గొప్పగా భావించారో.. చివరి శ్వాస తర్వాత కూడా ఆ జెండా నీడనే విశ్రమించడం అత్యంత అరుదని కొనియాడారు. ప్రజలతో గుర్తింపబడిన మహనీయుల పేర్లు ఈ రాష్ట్రంలో శాశ్వతంగా నిలవాలని, అందుకే తెలుగు విశ్వ విద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు, కోఠీ మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టుకున్నామని గుర్తు చేశారు. సామాన్య ప్రజల్లో చైతన్యం నింపి గోల్కొండ కోటను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న అందరికీ స్ఫూర్తిగా నిలవాలని ట్యాంక్‌బండ్‌పై వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుంటున్నామని తెలిపారు.

ఒక ప్రాంతం నుంచి సమాజంలో గుర్తింపు పొందిన ఉన్నప్పుడు చెప్పుకోవడానికి ఆ ప్రాంత వాసులకు గర్వంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. మొదటి తరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణా రావు, రెండో తరంలో జైపాల్ రెడ్డి, సురవరం సుధాకర్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు వన్నె తెచ్చారని, వారెప్పుడు సమాజంలో గౌరవం పొందుతూనే ఉంటారని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి గౌరవం, రాష్ట్ర స్థాయిలో ఉండే విధంగా శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా మంత్రివర్గంలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ప్రస్తుతం సమాజంలో ప్రజాస్వామిక మూల సిద్ధాంతానికి విరుద్ధంగా పెరిగిపోతున్న విపరీత పోకడలను అడ్డుకోవలసిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రమాదకర పరిస్థితులను తలెత్తుతున్నాయని, ప్రజలను చైతన్య పరిచే ఆలోచన ఎవరూ చేయడం లేదన్నారు. అందుకోసం ఐక్య కార్యాచరణ నిర్మించుకోవాలని, అప్పుడే సురవరం లాంటి నేతకు ఘనమైన నివాళి అని ముఖ్యమంత్రి అన్నారు.

'నిత్యం ప్రతిపక్షంగా ఉంటూ ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే. కమ్యూనిస్టులు తలచుకుంటే ప్రభుత్వాలు దిగిపోతాయని నేను బలంగా నమ్ముతున్నా. కమ్యూనిస్టు సిద్ధాంత పరిధి పెరగాలి. కమ్యూనిజమ్ అంటే కేవలం లైబ్రరీలో చదివే పుస్తకం కాదు.. ప్రజల పక్షాన పోరాడే చైతన్యం'గా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 'రాజ్యాంగాన్ని మార్చాలన్న ఆలోచన చేసే వారి నుంచి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి. జాతీయ స్థాయి రాజకీయాల్లో సురవరం లాంటి వారి అవసరం ఇప్పుడు ఉంది. దేశంలో అధికారంలో ఉన్న వాళ్లు... ఎన్నికల కమిషన్‌ను కూడా భాగస్వామ్యం చేసుకుని అధికారం పదిలపరుచుకోవాలనుకుంటున్నారు. వారికి వ్యతిరేకంగా ఉండే ఓట్లను తొలగించాలని ప్రయత్నిస్తున్నారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ సంస్మరణ సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సురవరం విజయలక్ష్మి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా, సీనియర్ నాయకులు కె. నారాయణ, కేవీపీ రామచందర్ రావు, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కమ్యూనిస్టు నాయకులు పాల్గొన్నారు.

# గణపతి బప్ప మోరియా కావాలయ్యా యూరియా

## కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

### ఖాళీ యూరియా బ్యాగులతో ఆందోళన

### సెక్రటేరియట్ ముట్టడి.. వ్యవసాయ కమిషనరేట్ ముందు నిరసన



(మొదటిపేజీ తరువాయి)

'గణపతి బప్ప మోరియా రావాలయ్యా యూరియా' అంటూ నినాదాలు చేశారు. రైతులకు ఖాళీ సంచులు ఢిల్లీకి డబ్బులు సంచులు' అంటూ ఆందోళన చేపట్టారు. యూరియా అడిగితే రైతులపై దాడి చేస్తారా, కొడతారా అంటూ ప్రశ్నించారు. అన్నదాతల సమస్యలు పరిష్కరించాలని బైఠాయించారు. దీంతో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, నిరంజన్ రెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్సీలను అదుపులోకి తీసుకున్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే కొరత**

బీజేపీ, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకొని తప్పించుకుంటున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. యూరియా పంపిణీ చేతగాకపోతే తప్పుకోవాలని చెప్పారు. యూరియా ఎప్పటిలోపు పంపిణీ చేస్తారో చెప్పకపోతే ఆందోళన విరమించేది లేదన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ తీసుకొని చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ రాష్ట్రంలో యూరియా కొరత లేదన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే తెలంగాణలో కొరత ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రాజకీయాల కోసం రాలేదని, రైతుల కోసం వచ్చామన్నారు. తాము పార్టీ కోసం ఆందోళన చేయడం లేదని, ప్రజలే ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేశామన్నారు.

**బీఆర్ఎస్ పై మండిపడ్డ మంత్రి తుమ్మల**

బీఆర్ఎస్ నేతల యూరియా ఆందోళన కార్యక్రమం ఓ కపట నాటకమంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. అధికారం లేదనే అక్కసుతోనే సచివాలయం వద్ద గులాబీ నేతలు ధర్నా చేశారని మండిపడ్డారు. యూరియా సరఫరా కేంద్ర పరిధిలోని అంశమని బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఈ అంశం గురించి తెలియదా అని ప్రశ్నించిన తుమ్మల రేవంత్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే దిగజారుడు రాజకీయం ఎవరి కోసమని సూటిగా ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా సరఫరాలో నిర్లక్ష్యంపై కేంద్రాన్ని నిలదీయకుండా తమపై శాపనార్థాలేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేసినందుకే యూరియా పంపిస్తున్నారని గుర్తుచేశారు. రైతుల ముసుగులో గులాబీ నేతల ప్రేరేపిత ఉద్యమాలను ప్రజలు హర్షించరని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం చేసే నాటకాలను కర్షకులు నమ్మే స్థితిలో లేరని మంత్రి తుమ్మల ఎద్దేవా చేశారు.



# నవీన్ యాదవ్‌కే జూబ్లీహిల్స్?

## కాంగ్రెస్ హైకమాండ్ డిసైడ్

### బీసీలకే ఇవ్వాలని నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సీటుకోసం పలువురు బీసీ నేతలు పోటీపడుతుండగా, సర్వేలలో నవీన్ యాదవ్ ముందువరుసలో నిలిచినట్లు తెలుస్తోంది. అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇవ్వడం ద్వారా నవీన్ యాదవ్ కు లైన్ క్లియర్ చేసినట్లేనన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో ఉంది. బొంతు రామ్మోహన్, అంజన్ కుమార్ యాదవ్, మురళీగౌడ్ తదితరులు బీసీ కోటాలో ప్రయత్నాలుచేసినా.. తాజా రాజకీయ పరిణామాలు నవీన్ యాదవ్ కు అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తో పాటు ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ పలురకాల నివేదికలు తెప్పించుకుని అభ్యర్థిపై ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పట్టుదలతో బీసీలకు జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ పార్టీలో అధికారిక ప్రకటన వచ్చేదాకా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తూనే ఉంటారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఈ నియోజకవర్గంలో భారీ ఆధిక్యం లభించింది. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యే గోపినాథ్ చనిపోవడంతో ఉప ఎన్నిక రాగా, పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉండే అవకాశముంది.

# అసెంబ్లీకి రాని కేసీఆర్ రాజీనామా చేయాలి

## ఆయన అసెంబ్లీకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్లే..

### కాళేశ్వరంలో లక్ష కోట్లు తిన్న వాళ్లను ఊరికే వదిలేస్తామా?

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అన్నీ తానే అని గొప్పలు చెప్పుకున్న కేసీఆర్.. అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వాలి అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ వద్ద మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడారు. కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రాకపోతే తప్పు ఒప్పుకున్నట్లే అని కామెంట్స్ చేశారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత స్థానానికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి అసెంబ్లీ సమావేశాల్లో హరీష్ రావును, కేటీఆర్ ను అసెంబ్లీ సేషన్ లో మాట్లాడాలని కేసీఆర్ చెప్తున్నారు. వాళ్లే మాట్లాడిన తర్వాత కేసీఆర్ కు ప్రతిపక్ష హోదా ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నాయకుడిగా రాజీనామా చేయాలన్నారు. ప్రతిపక్ష నాయకుడు బాధ్యతలు హరీష్ రావుకు అప్పగించాలని డిమాండ్ చేశారు.కాళేశ్వరం కేసీఆర్ హయాంలోనే రికార్డు స్థాయిలో కట్టారని.. ఆయన హయాంలోనే కూలిందని సెటైర్లు వేశారు. కాళేశ్వరంపై వేసిన కమిషన్ జడ్జి..సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేశారని, మంచి పేరున్న న్యాయమూర్తి ఆయన అంటూ స్పష్టం చేశారు. సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని తెలిపారు. దానికి భయపడే కేసీఆర్, హరీష్ రావు కోర్టుకు పోయారని విమర్శించారు.

## తప్పయితే బాధ్యతగా ఒప్పుకోవాలి..

కాళేశ్వరం కమిషన్ నివేదిక తప్పు అని భావిస్తే.. కేసీఆర్ అసెంబ్లీ వచ్చి చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేతగా జీత భత్యాలు తీసుకుంటున్నాడని, అసెంబ్లీకి రావాల్సిన అవసరం ఆయనపై ఉందని సూచించారు. కాళేశ్వరం పై చర్చ పెడితే అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌంట్ చేయకుండా.. మా మీద పూలు చల్లుతారా.? తప్పించుకుని పారిపోతారని అన్నారు. కాళేశ్వరం పూర్తి నివేదిక, కంప్లీట్ గా చర్చ ఉంటుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అన్నీ తానే అని చెప్పకున్న కేసీఆర్ అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం విషయంలో తప్పైతే తప్పని బాధ్యతగా ఒప్పుకోవాలి అని సవాల్ విసిరారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తాడని అనుకుంటున్నామని చెప్పారు. కాళేశ్వరంపై రూ. లక్ష కోట్లు తిన్న వాళ్లను వదిలేస్తామా.? అని ప్రశ్నించారు. ప్రజల ముందు దోషులుగా నిలబెడతామని, వాళ్లను ఏం చేయాలో ప్రజలు నిర్ణయిస్తారని తెలిపారు. కాళేశ్వరంపై పెట్టిన శ్రద్ధ 10 ఏళ్లు డిండి, పాలమూరు లాంటి ప్రాజెక్టుల మీద ఎందుకు పెట్టలేదు.? అని నిలదీశారు.



# బాలయ్య పెద్దమనసు

## సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షలు విరాళం


**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా పంట నష్టం, ఆస్తి నష్టం జరిగిన క్రమంలో.. అగ్ర నటుడు బాలకృష్ణ స్పందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కు 50 లక్షల రూపాయలు డొనేట్ చేసి మంచి మనసు చాటుకున్నారు. శనివారం హైదరాబాద్ లో జరిగిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సన్మాన కార్యక్రమంలో ఈ ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. వర్షాలు, వరదల కారణంగా తెలంగాణలో కొన్ని జిల్లాలలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది.. నష్టం దృష్ట్యా.. ఉడతఆ భక్తిగా రూ.50 లక్షలు డొనేట్ చేస్తున్నానని అన్నారు. ఇక ముందు కూడా ఇలాంటి సహకారం తననుంచి ఉంటుందని చెప్పారు. అంతకు ముందు సినీ పరిశ్రమ నుంచి డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మొదటగా ముందు కొచ్చారు. తెలంగాణలో వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టానికి ముందుగా స్పందించిన సందీప్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ కు 10 లక్షల రూపాయలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి బండి సంజయ్, ఏపీ మంత్రి నారా లోకేష్ తో పాటు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

# తెలంగాణ మంత్రివర్గంలోకి అజారుద్దీన్?

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ కు ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఈ జిల్లాకు కూడా మంత్రి వర్గంలో ప్రాతినిథ్యం లేదు. ఈ క్రమంలో హైదారాబాద్ కు చెందిన మైనార్టీ వ్యక్తి మీర్ అలీఖాన్ కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినా మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. ఏడాది తర్వాత దీనిని సుప్రీంకోర్టు రద్దుచేయడంతో ఇపుడు అనూహ్యంగా ఈ ఛాన్స్ అజారుద్దీన్ కు దక్కింది. ఎమ్మెల్సీగా అజారుద్దీన్ ను ప్రకటించడం వెనుక ఈయనను మంత్రి వర్గంలోకి తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఇటు మైనార్టీ కోటా, హైదరాబాద్ జిల్లా కోటా కింద అజారుద్దీన్ కు మంత్రి వర్గంలోనూ చోటు కల్పించాలనే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుందనే చర్చ జరుగుతోంది. అయితే జూబ్లిహిల్స్ బై పోల్ కంటే కూడా మైనారిటీ నేతగా, అంతర్జాతీయ క్రికెటర్ గా ఉన్న పాపులారిటీని బీహార్ ఎన్నికల్లోనూ ఉపయోగించుకోవాలని హైకమాండ్ భావిస్తోందని సమాచారం. ఈ క్రమంలో జూబ్లిహిల్స్ షెడ్యూల్ కు ముందే అజారుద్దీన్ ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 6 లేదా 9న ఆయన ప్రమాణస్వీకారం చేసినా ఆశ్చర్యంలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి.

**కోదండరాంపై సీఎం మాట**



కోదండరాంను పది హేనురోజుల్లో ఎమ్మెల్సీగా పంపుతానంటూ ఉస్మానియాలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలుపుకున్నారు. శనివారం గవర్నర్ కు దస్త్రం పంపగా, దీనిని ఆమోదిస్తే పదవీకాలం కూడా పెరగనుంది. కోదండరాం ఎంపికపై సుప్రీం తీర్పు నివ్వగానే బీఆర్ఎస్ క్యాడర్ తో పాటు పలువురు నేతలు ట్రోల్స్ చేశారు. దీనిపై కోదండరాం కూడా విచారం వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం మరోసారి ఎంపిక చేసింది.



# ప్రజల అతి విశ్వాసంతోనే వరదలు

- కామారెడ్డి ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు
- ఓటువేశామని ము.. కడగాలంటే కుదరదు
- ప్రజాతప్పిదం వల్లే కామారెడ్డికి దుస్థితి

**కామారెడ్డి, మహా :** వరదలపై కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రజల అతి విశ్వాసంతోనే వరదల్లో చిక్కుకున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. విపత్తుల సమయంలో ప్రభుత్వం, నాయకులు ఏమీ చేయలేరని.. ప్రజలే అప్రమత్తంగా ఉండాలని వ్యాఖ్యానించారు. వర్షాలు పడుతున్న సమయంలో వరదలు తక్కువగా ఉన్నప్పుడే జనం భయటకు వచ్చి ఉంటే బాగుండేదని వెంకటరమణరెడ్డి అన్నారు. ప్రజాతప్పిదం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. ఆక్రమణలు కూడా దీనికి కారణమేనని వ్యాఖ్యానించారు. అధికారులు, ఎమ్మెల్యే కనబడటం లేదని.. ఎవరెవరో ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నారని ఫైర్ అయ్యారు. ఓటు వేసినందుకు వారి ముడ్డి కడగాలంటే కుదరదని ఘాటుగా స్పందించారు. వరదల సమయంలో కామారెడ్డిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించానన్నారు.. అలాగని ఫొటోలకు పోజులు ఇవ్వలేదని ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి తెలిపారు. కామారెడ్డిలో మూడు గంటల్లోనే కుండపోత వర్షం కురిసిందని, జల విలయం సంభవించిందని చెప్పారు. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో కామారెడ్డి చుట్టుపక్కల చెరువులు అలుగు పారాయని, కట్టలు తెగిపోయాయని అన్నారు. ఊహించని నష్టం వాటిల్లిందని తెలిపారు. వర్షాల్లో అధికారులతో కష్టపడి పనిచేశానని చెప్పుకున్నారు. అయినప్పటికీ కొంతమంది సోషల్‌మీడియాలో ఘోరమైన కామెంట్లు పెడుతున్నారని వాపోయారు. విపత్కర పరిస్థితుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలేతప్ప.. ఇలాంటి పిచ్చి కామెంట్లు పెట్టడం సరికాదని ఎమ్మెల్యే హితవు పలికారు. వరదల్లో నేను ఏం చేశానో ప్రజలకు, బాధితులకు తెలుసని వ్యాఖ్యానించారు.

# పంచాయతీ ఎన్నికలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదం.. వరదలతో జరిగిన నష్టానికి నిధుల మంజూరు.. వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో భేటీ అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది. అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తోపాటు, ఇటీవల వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. మరోవైపు సెప్టెంబర్ 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది.



భారీ వర్షా లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి

మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయని, కొంత ప్రాణ నష్టంతో పాటు పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగిందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, చెరువులు దెబ్బతిన్నాయి. ఉన్నతాధికారులు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పూర్తి వివరాలతో రావాలని ఆదేశించడం జరిగిందన్నారు. సోమవారం సాయంత్రం ఆ నివేదికను పరిశీలించి నిధులు మంజూరు చేయాలని కేబినెట్ తీర్మానించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపిందని వివరించారు. రాష్ట్రంలో వందల సంఖ్యలో గోశాలలు ఉన్నప్పటికీ వాటిలో గోవులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా మంత్రి మండలి గోశాల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించిందని, ఇప్పుడు వాటికి సంబంధించిన స్పష్టమైన విధి విధానాలను రూపొందించుకొని ఆమోదించడం జరిగిందన్నారు. నీటిపారుదల రంగంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ కింద వస్తున్న మద్దతుపై చర్చించి నేషనల్ హైడ్రాలజీ ఎక్విప్ మెంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

**మిల్లర్లు డబ్బులు చెల్లించకపోతే చర్యలు..**

202223 రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరించిన గత ప్రభుత్వం టెండర్లు పిలిచి ఉద్దేశపూర్వకంగా పొడిగిస్తూ వచ్చిందని తెలిపారు. 2023 డిసెంబర్ 7వ తేదీన కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విధానపరమైన నిర్ణయం తీసుకొని టెండర్లు ఫైనలైజ్ చేసినప్పటికీ మిల్లర్ల దగ్గర మిగిలిపోయిన సుమారు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తిరిగి ఇవ్వలేదని చెప్పారు. రికవరీ కాని ధాన్యానికి సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ న్యాయపరమైన అంశాలను క్షుణంగా పరిశీలించి మిల్లర్లు డబ్బులు చెల్లించకపోతే చర్య తీసుకోవడానికి వెనకాడవద్దని నిర్ణయించిందన్నారు. అవసరమైతే మిల్లర్లపై పీడీ యాక్ట్ పెట్టాలని మంత్రి మండలి తీర్మానం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మత్స్య సహకార సంఘాలు ఉన్నప్పటికీ వాటికి ఎన్నికలు నిర్వహించేందుకు ఆలస్యమవుతున్నందున సహకార సంఘాలకు పర్సనల్ ఇంఛార్జ్‌లు నియమించడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ప్రస్తుతం సంఘంలో సభ్యులుగా ఉన్న వారినే పర్సనల్ ఇంఛార్జ్ లుగా నామినేట్ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని, అదే విధంగా గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా ప్రొఫెసర్ కోదండరామ్, అజారుద్దీన్ పేర్లకు మంత్రి మండలి ఆమోదం తెలిపినట్లు మంత్రులు పొంగులేటి, పొన్నం వెల్లడించారు.

## యూరియాపై బీఆర్ఎస్ ఆందోళన కపట నాటకం

**రైతుల ముసుగులో ప్రేరేపిత ఉద్యమాలు ప్రజలు హర్షిస్తారా?**

ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే దిగజారుడు రాజకీయం ఎవరి కోసం?

బీఆర్ఎస్ నేతలపై మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఫైర్



**హైదరాబాద్, మహా:** యూరియా కొరతపై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆందోళనలను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఖండించారు. ఇదంతా కపట నాటకమని మండిపడ్డారు. యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వం కారణమా? లేక కేంద్ర ప్రభుత్వమా.. కారణమేదో మీకు తెలియదా? యూరియా సరఫరా కేంద్ర ప్రభుత్వం పరిధిలోని విషయమని పదేళ్ల మీ పాలనలో మీకు తెలియదా? అంటూ బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. రైతుల ముసుగులో మీ ప్రేరేపిత ఉద్యమాలు ప్రజలు హర్షిస్తారా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం లేదనే అక్కసుతో రేవంత్ ప్రభుత్వాన్ని బదనం చేయాలనే దిగజారుడు రాజకీయం ఎవరి కోసం అంటూ ప్రశ్నించారు. జియో పాలిటిక్స్ వల్ల దేశీయ ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గట్టు లేక యూరియా కొరత ఉంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు ఎందుకు అంటూ మండిపడ్డారు.

**కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రశ్నించకుండా..**

యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు ఎందుకని మంత్రి తుమ్మల ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి పాలనలో మూడు పంట కాలాల్లో యూరియా కొరత లేనీ విషయం మీకు తెలియదా, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యూరియా కొరత ఉంటే సీఎం రేవంత్ పై మీ శాపనార్ధాలు ఏంటి? అని నిలదీశారు. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తేనే తెలంగాణకు యూరియా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. రైతాంగం ప్రయోజనాల కంటే మీ రాజకీయ ప్రయోజనాల కోసం మీరు చేసే నాటకాలు రైతులు నమ్మే స్థితిలో లేరని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

## పిచ్చి వేషాలు నడవవు



- డబ్బుతో దౌర్జన్యం చేస్తామంటే బీ కేర్ఫుల్
- అహంకారం ఉన్న వాళ్ల చెంప చెల్లుమనిపిస్తాం
- ఎంపీ ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్

**మేడ్చల్, మహా:** బాచుపల్లిలో ఫసిఫికా కన్స్ట్రక్షన్ ఆవాస్ నెబ్యూలా అపార్టుమెంట్ వద్ద కొనుగోలు చేసిన బాధితులు చేస్తున్న ఆందోళనకు ఎంపీ ఈటల రాజేందర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రైవేటు కంపెనీలో పనిచేసే వారు, ఉద్యోగులు, రిటైర్మెంట్ అయిన డబ్బులతో ఈ అపార్ట్మెంట్ లో ఇల్లు కొనుక్కున్నారని తెలిపారు. కిరాయి ఇంట్లో ఉండి చనిపోతే శవాన్ని రోడ్డు మీద వేయవద్దు అని సొంత ఇంటి కోసం అనేకమంది పరితపిస్తారని చెప్పారు. '2015 లో 2724 మందికి అరచేతిలో వైకుంఠం చూపించి ఈ ఫ్లాట్లు అమ్మారు. పదేళ్లు అయినా సొంత ఇళ్ళు రాకపోవడంతో కొన్నవారు అన్ని ప్రభుత్వ ఆఫీసుల, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగారు. కానీ బిల్డర్లు డబ్బులతో మ్యానేజ్ చేసి, అడ్వకెట్లను పెట్టి కోర్టు కేసులు వేసి, బౌన్సర్లను పెట్టి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇలాంటి పిచ్చి వేషాలు బంద్ చేయాలని హెచ్చరిస్తున్నాను. డబ్బుతో దౌర్జన్యం చేస్తా అంటే బీ కేర్ఫుల్. ఇలాంటి పిచ్చి వేషాలు నడవవు. నువ్వు డబ్బులున్నాయని తలచుకుంటే ఏం చెయ్యలేవు. పైసలతో ఏదన్నా మ్యానేజ్ చేస్తాం అన్న అహంకారం ఉన్న వాళ్ళ చెంప చెల్లుమనిపిస్తాం. బౌన్సర్లు ఎవరిమీద అయిన చేయి చేసుకుంటే కుటుంబాలకు దూరం అవుతారు జాగ్రత్త. బాధితులు కన్స్ట్రక్షన్ లో క్వాలిటీ లేదు అని వాపోతున్నారు. కొత్త ఇంటికి పోతున్నమా పాత ఇంటికి పోతున్నమా అనిపిస్తుంది అంటున్నారు. కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చెయ్యలేదు అని కంప్లైంట్ చేస్తున్నారు' అని కామెంట్స్ చేశారు.

## సభ కనీసం 30 రోజులైనా నడపాలె

**త్వరగా సమావేశాలకు మంగళం పాడాలని చూస్తున్నరు**

ఉద్యోగుల బకాయిలు, ఫీజు రియింబర్స్ మెంట్, యూరియా కొరతపై చర్చ జరగాలి

ప్రభుత్వానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలక డిమాండ్లు



**హైదరాబాద్, మహా:** తూతూమంత్రంగా అసెంబ్లీని మూడు, నాలుగు రోజులు పెట్టాలని చూస్తున్నారని, ప్రజా సమస్యలపై చర్చించేం దుకు కనీసం 30 రోజులైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీజూఎల్పీ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. తాము అడగబోయే సమస్యలకు సమాధానం చెప్పలేక త్వరగా సమావేశాలకు మంగళం పాడాలని చూస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగుల బకాయిలు, ఫీజు రియింబర్స్ మెంట్, యూరియా కొరతపై సభలో చర్చ జరగాలన్నారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ. అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి రైతులపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కుండపోత వర్షాల కారణంగా అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. భారీగా పంట నష్టం వాటిల్లి విపరీతంగా నష్టపోయారని కామెంట్ చేశారు. రాష్ట్రంలో సుమారు 2.20లక్షల ఎకరాల ల్లో వివిధ రకాల పంటలు నాశనం అయ్యాయని, బాధిత రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో అతలాకుతలమైన జిలాల్లో మంత్రులు పర్యటించకపోవడం దారుణమని అన్నారు. ఒకవేళ దేశానికి అన్నం పెట్టే అన్నదాత మీద నిజంగానే శ్రద్ధ ఉంటే ప్రభుత్వం ఒక్క ప్రకటనైనా ఎందుకు విడుదల చేయలేదన్నారు. మూసీ నది పక్షాళన, స్పోర్ట్ పాలసీ, అందాల పోటీలపై ప్రభుత్వానికి ఉన్న రైతుల మీద లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## వరద గుప్పిట్లో నిర్మల్ జిల్లా

**జలదిగ్భంధంలో బాసర ఆలయం**



**బాసర, మహా :** బాసర వద్ద గోదావరి ఉగ్రరూపం చూపిస్తోంది. గోదావరి నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో ఇతర ఆలయాలు, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులు నీటమునిగాయి. వరదలో చిక్కుకున్న వారిని ఎస్డీఆర్ ఎఫ్ , స్థానిక పోలీసులు బృందాలు రక్షించాయి. మరోవైపు శ్రీరాం సాగర్ , మహారాష్ట్రలోని గైక్వాడ్ ప్రాజెక్టుల నుంచి వచ్చిన భారీ వరద నిర్మల్ జిల్లాలోని సోన్ గ్రామాన్ని చుట్టుముట్టింది. సమీప గ్రామాల్లోనూ లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి.

**వరదలతో నిర్మల్ జిల్లా అతలాకుతలం**

ఇటీవల కురిసిన వర్షాలు, ఎగువన మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదతో నిర్మల్ జిల్లా అతలాకుతలం అవుతోంది. బాసరలో రెండు రోజులుగా గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. అంతకంతకూ పెరుగుతున్న వరదతో గోదావరి నుంచి ఆలయం వరకు వెళ్లే ప్రధాన రహదారి జలమయం అయింది. సమీప ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వ్యాస మహర్షి ఆలయం, టీటీడీ అతిథి గృహాల వరకు వరద చేరుకొంది. దుకాణాలు, ప్రైవేటు లాడ్జ్‌లు, సత్రాలు అన్ని వరద గుప్పిట్లో చిక్కుకున్నాయి. మొదటి ఘాట్ , గంగామాత, సూర్యేశ్వర శివాలయం, గోదావరి నుంచి ఆలయానికి వెళ్లే మార్గంతో పాటు అక్షర కాలనీ, టెంపుల్ కామన్ రోడ్డు, ఎస్‌బీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లు నీట మునిగాయి.

**సురక్షిత ప్రాంతాలకు తరలింపు..**

అక్షర కాలనీలో చిక్కుకున్న వారిని స్థానికులు ట్రాక్టర్ సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అమ్మవారి ఆలయ సమీపంలోని ఆర్యవైశ్య సత్రంలో చిక్కుకున్న గర్భిణిని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, బాసర ఎస్ఐ బయటకు తీసుకువచ్చారు. నాగభూషన్ విద్యాలయం చుట్టూ నీరు చేరడంతో వెనుకాల గేటు ద్వారా పైఅంతస్తులోని విద్యార్థులు, ఉపాధ్యాయులను బయటకు పంపించారు. ఎస్‌బీఐలోని సిబ్బందిని సైతం బోట్లతో బయటకు తీసుకువచ్చారు. బాసర మండలంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యటించారు.

## అసెంబ్లీ సెషన్స్ ప్రారంభం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. నాలుగైదు రోజుల పాటు ఈ సమావేశాలు జరగనున్నాయి. నూతనంగా ఎన్నికైన శాసనమండలి సభ్యులను మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. మరోవైపు ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణం పట్ల సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపీనాథ్ గారిని చిన్ననాటి నుంచి తనకు మిత్రుడు అని పేర్కొన్నారు. గోపీనాథ్ మృతి తనకు ఎంతో బాధ కలిగించిందని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు. సభలో సంతాప తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ, గోపీనాథ్ మృతి పట్ల సభ తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసిందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో నివసించిన చాలా మందికి గోపీనాథ్ సుపరిచితులు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు. గోపీనాథ్ తనకు మంచి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్సీలు రత్నాకర్, రంగారెడ్డి మృతిపట్ల మండలిలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు.

### కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ పై సభలో చర్చ..

ఈ తీర్మానాలపై చర్చ అనంతరం సమావేశాలు వాయిదా పడతాయి. అసెంబ్లీ, మండలిలో వేర్వేరుగా నిర్వహించనున్న బీఏసీ సమావేశాల్లో ఎన్ని రోజుల పాటు సభలను నిర్వహించాలనే దానిపై తుది నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్ చాంబరలో హాట్‌హాట్‌గా బీఏసీ సమావేశం సాగింది. బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. యూరియా, వరదలపై చర్చకు బీఆర్ఎస్ నేతలు పట్టుబట్టారు. ముందుగా కష్టాల్లో ఉన్న రైతుల సమస్యలను చర్చించాలని డిమాండ్ చేశారు. వరదలు ముఖ్యం కాదు, బురద జల్లడం ముఖ్యమన్నట్లు ప్రభుత్వం ఉందని హరీశ్ రావు తెలిపారు. ఎరువుల కొరత, వరదలపై చర్చించాలని బీఆర్ఎస్ పట్టుబట్టింది. ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరించకపోవడంతో నిరసనగా బీఏసీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. బీఏసీ ముగిసిన అనంతరం.. మీడియాతో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. సభ ఎన్ని రోజులు జరపాలి అన్న అంశంపై ఇవాళ నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ పై నేడు సభలో చర్చ ఉంటుందని, అలాగే రిజర్వేషన్ల బిల్లును కూడా సభలో పెడతామన్నారు. పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు బీఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వాలా? లేదా? అన్నది స్పీకర్ నిర్ణయమని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## జాతీయ క్రీడల్లో సత్తా చాటిన పల్లె కుసుమాలు

**రోప్ స్కిప్పింగ్ లో శ్రీబిందు శ్రీసింధులకు జాతీయ అవార్డు**

బాలికలను సన్మానించిన క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**రంగారెడ్డి జిల్లా మహా:** పల్లెల్లో వెలిసిన కుసుమాలు ఈ అక్కాచెల్లెళ్ళు అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నగరంలోని పికెట్ స్కూల్ లో జరిగిన 54వ జాతీయ స్థాయి అండర్ 19 రోప్ స్కిప్పింగ్ లో అక్కాచెల్లెళ్ళు సత్తా చాటారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, యాచారం మండలం, మంతన్ గౌరెల్లి గ్రామానికి చెందిన అక్కా చెల్లెళ్ళు శ్రీబిందు, శ్రీసింధులకు రోప్ స్కిప్పింగ్ లో జాతీయ స్థాయిలో రాణించారు. ఈ సందర్భంగా వారిని తెలంగాణ రాష్ట్ర క్రీడశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డిలు, అవార్డు అందించి సన్మానించారు. మునుముందు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... పల్లెల నుంచి వచ్చిన అక్క చెల్లెలు, మంచి ప్రతిభను కనబరిచి అవార్డు సొంతం చేసుకోవడం, 25 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో శ్రీబిందు, శ్రీసింధులు జాతీయ స్థాయి అవార్డు సాధించడం గర్వంగా ఉందని, పల్లెల్లో వెలసిన కుసుమాలు ఈ అక్కాచెల్లెళ్ళు అని, మంత్రి వాకిటి శ్రీహరి వారిరువురిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బాలకృష్ణ రెడ్డి, బలరాం రెడ్డి, శరత్ బాబు, బాలికల తల్లిదండ్రులు డా.జ్యోతిజైపాల్ నాయక్ లు పాల్గొన్నారు.

## మీ ప్రభుత్వంలో లేని పీపీటీ సంప్రదాయం ఇప్పుడెందుకు?

**గతంలో మేము అడిగినప్పుడు ఎందుకు ఇవ్వాలే?**

బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ) ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పుడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే బీఆర్ఎస్ వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు.

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?

ANN SCHOOL OF JOURNALISM TELUGU ESTD.2025

జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం

ANN SCHOOL OF JOURNALISMలో

జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.



గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 4

తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 2వ వారం

- పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
- మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు
- 8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
- కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
- మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్‌షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్

HURRY UP! LIMITED TIME త్వరపడండి...

FOR ADMISSIONS CONTACT: +91 74369 39999

SCAN ME

APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

అడ్మిషన్లు ప్రారంభమైనవి | ఆఖరుతేదీ - సెప్టెంబర్ 4 | తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 2వ వారం

ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM,

95501 59679, 90001 41919

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# వరదల్లో ప్రజలు.. నిందల్లో నేతలు

**అసాధరణ వర్షా లు ఉత్తర తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఇంకా ముప్ప పొంచి ఉంది. ఈ సమయంలో రాజకీయాలు పక్కనపెట్టి బాధితులకు బాసటగా నిలవాల్సిన అవసరం నాయకులపై ఉంది. ప్రజలు బాధల్లో ఉంటే.. నేతలు విమర్శలు, నిందల్లో కాలంగడిపే పంథాను ప్రజలు హర్షించరు. తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య కాళేశ్వర రాజకీయం సాగుతుండగా, ఏపీలో ఐటీ విస్తరిస్తోంది. ఐబీఎం తమ క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్ ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ట్రంప్ టారిఫ్ లతో అమెరికాకే కొత్త చిక్కులురాగా, భారత్ -చైనా- రష్యా మైత్రి ఆర్థిక వృద్ధిపై కొత్త ఆశలు కలిగిస్తోంది.**

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

అసాధరణ వర్షాలు.. ఉత్తర తెలంగాణలోని పలు పట్టణాలకు కనివిని ఎరుగని విషాదం మిగిల్చాయి. వరద ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే జరిపారు. కామారెడ్డి ప్రాంతం తెలంగాణలో ఏ ప్రాంతం ఎరుగని నష్టాన్ని చూసింది. రోడ్లు, హైవేలు, ఇండ్లు జరిగిన విధ్వంసం చాలా ఉంది. భారీ వరదలు సంభవించిన సమయంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతూ ప్రజలు మధ్యలో ఉండాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలతో ఉంటే.. భరోసా ఏర్పడుతుంది. ఈ సమయంలో అసెంబ్లీ నిర్వహించడం, ఇందులో ప్రధానంగా ప్రతిపక్ష పార్టీ తప్పులను ఎత్తిచూపే నివేదికపై చర్చకు ప్రజలు కష్టాల్లో ఉన్న సమయాన్ని ఎంచుకోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. తెలంగాణలో ఓ వైపు భారీ వర్షాలు, వరద నష్టాలు ప్రజలకు కష్టాలు మిగల్చగా, యూరియా పరిస్థితి కూడా పలు జిల్లాల్లో ఆందోళనకరంగా ఉంది. ఇక వరదల సమయంలో నిందల వల్ల ప్రయోజనం ఉండదు. ప్రజల బతుకులు చిగురించే ధైర్యం నింపే చర్యలు తక్షణ అవసరం.

తెలంగాణ రాష్ట్రంలో వైభవంగా జరుపుకునే గణేష్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసులను కూడా హైదరాబాద్ రప్పిస్తుంటారు. మరోవైపు అసెంబ్లీ నిర్వహణ కూడా అత్యంత కీలకం. ఈ సమయంలో కూడా హైదరాబాద్ పోలీసులతో పాటు ఇతర జిల్లాల వారిని కూడా హైదరాబాద్ కు విధుల కోసం పిలుస్తారు. రెండు భారీ ఈవెంట్లు ఒకేసారి నిర్వహించడం కత్తిమీద సాము. గణేష్ బందోబస్తే అత్యంత కీలకం. వీటికి తోడు రాష్ట్రంలో వరదలు.. వర్షాలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనుకోవడంపైనే రాజకీయవర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. బీసీ బిల్లుపై ఇప్పటికే అనేకసార్లు చర్చపెట్టిన ప్రభుత్వం మరోసారి అసెంబ్లీలో చర్చకు పెట్టి స్థానిక ఎన్నికల రిజర్వేషన్లకు ఆమోదం తెలపనున్నట్లు ప్రకటించింది. ప్రజలు సమస్యల్లో ఉన్నపుడు ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా కల్పించాలి. ప్రజలే సమస్యలే ప్రభుత్వాల ప్రాధాన్యం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళు, సన్నబియ్యం, రైతుభరోసా వంటి కార్యక్రమాలతో గ్రామీణ ప్రజలకు ఊరటనిచ్చినా.. వరదల సమస్యలు ప్రభుత్వం వ్యవహరించిన తీరు, యూరియా సమస్య, సర్కారు ప్రాధాన్యతలు రానున్న ఎన్నికల్లో సవాల్ గా మారే ప్రమాదముంది. ఈ సమమయంలో అసెంబ్లీ నిర్వహించి ప్రతిపక్ష తప్పులను చీల్చిచెండాడాలనుకున్న ప్రభుత్వ వ్యూహం చాణక్యం అర్థం చేసుకోవాల్సిందే. ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్.. కేంద్రంలో మోదీ సర్కారు అండ కార్పొరేట్ కంపెనీలను ఏపీ వైపు ఆకర్షిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు ఐటీ కంపెనీలు క్యూ కడుతున్నాయి. ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఐబీఎం అమరావతిలో అడుగు పెట్టనుంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఐబీఎం తమ క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్‌ను వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిపై స్వయంగా ప్రకటన కూడా చేసింది.

భారత్‌లో 'ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ 2'ను ఏర్పాటు చేయడానికి ఐబీఎం భాగస్వామ్యం కుదుర్చుకుంది. అమరావతితో పాటు స్పెయిన్, అమెరికాలోని చికాగోలో కూడా త్వరలో కేంద్రాలను ఐబీఎం ఏర్పాటుచేయనుంది. విశాఖపట్నంలో టీసీఎస్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. చంద్రబాబు దార్శనికతకు, లోకేష్ పట్టుదల తోడవడంతో ఏపీలో పెట్టుబడులపై కంపెనీలు ఆసక్తిప్రదర్శిస్తున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ 75ఏళ్ళ రిటైర్‌మెంట్ అంశం గత కొన్నేళ్ళుగా జరుగుతున్న చర్చపై స్పష్టత వచ్చింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అలాంటి నిబంధనేమీ లేదని తేల్చిచెప్పడంతో.. దీనికి సంబంధించి చర్చలు జరిగి, ఓ అభిప్రాయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది. మోదీ తర్వాత ఎవరు అంటూ వారసులపై రకరకాల చర్చలు జరగ్గా, అవన్నీ ఈ టర్మ్ ముగిసేవరకు మరో మూడున్నరేళ్ళు పక్కకు పెట్టాల్సిందే. మోదీ ఇప్పటికీ ఫిట్ గా ఉన్నారు. ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి భారత్, చైనా కలిసి పనిచేయడం కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్, చైనా స్నేహం ప్రాంతీయ, ప్రపంచ శ్రేయస్సుకు అవసరమన్న భావన భారతీయుల్లోనూ, అమెరికా వ్యతిరేకుల్లోనూ నెలకొంది. భారత్ చైనా రష్యా మైత్రి మూడుదేశాలకు ఉపయోగపడనుండగా, ఆర్థికంగా భారత్ ను మరింత పటిష్ట పరుస్తుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.









భారీ వరదలు సంభవించిన సమయంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతూ ప్రజలు మధ్యలో ఉండాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలతో ఉంటే.. భరోసా ఏర్పడుతుంది. ఈ సమయంలో అసెంబ్లీ నిర్వహించడం, ఇందులో ప్రధానంగా ప్రతిపక్ష పార్టీ తప్పులను ఎత్తిచూపే నివేదికపై చర్చకు ప్రజలు కష్టాల్లో ఉన్న సమయాన్ని ఎంచుకోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

తెలంగాణ రాష్ట్రంలో వైభవంగా జరుపుకునే గణేష్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసులను కూడా హైదరాబాద్ రప్పిస్తుంటారు. మరోవైపు అసెంబ్లీ నిర్వహణ కూడా అత్యంత కీలకం. ఈ సమయంలో కూడా హైదరాబాద్ పోలీసులతో పాటు ఇతర జిల్లాల వారిని కూడా హైదరాబాద్ కు విధుల కోసం పిలుస్తారు. రెండు భారీ ఈవెంట్లు ఒకేసారి నిర్వహించడం కత్తిమీద సాము.

ప్రధాని నరేంద్రమోదీ 75ఏళ్ళ రిటైర్‌మెంట్ అంశం గత కొన్నేళ్ళుగా జరుగుతున్న చర్చపై స్పష్టత వచ్చింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అలాంటి నిబంధనేమీ లేదని తేల్చిచెప్పడంతో.. దీనికి సంబంధించి చర్చలు జరిగి, ఓ అభిప్రాయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది. బిజెపికి సంబంధించి ఇది ఉత్సాహాన్నిచ్చే పరిణామమే.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# అణచివేత: నిప్పు కణికల మీద నిద్ర





పాతులోతు పాండు నాయక్
98853 33196

మన దేశం అనేక ఆశలు, ఆశయాలతో స్వాతంత్ర్యం పొందింది. కానీ, దశాబ్దాలు గడుస్తున్నా సమానత్వ ఆశయం ఇంకా పూర్తి కాలేదు. స్వాతంత్ర్యం తెచ్చిన ఆశలు, ఆశయాలు కొంతమందికే పరిమితం కాగా, లక్షలాది మంది ఇంకా అణచివేత, వివక్షల ఊబిలో కూరుకుపోయారు. ఇది మన జాతికి ఒక చేదు నిజం. వారి గుండెల్లో రగిలిన బాధ, నిరాశ ఎప్పుడో ఒకప్పుడు ఆశా జ్వాలలుగా మారి తిరుగుబాటుకు దారితీసే అవకాశం ఉంది. ఇది ఏ పాలకుడూ, ఏ సమాజమూ కోరుకోకూడదు. తిరుగుబాటు రాకుండా ఉండాలంటే పాలకులు ముందుగా స్వార్థాన్ని పక్కన పెట్టాలి. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జాతి ఆత్మగౌరవమే గొప్పదని భావించాలి. అప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది. అణచివేతకు గురైన వర్గాల తిరుగుబాటు కేవలం కఠిన చట్టాలతో, సైన్యంతో అణచివేయడం సాధ్యం కాదు. వివక్ష అనే చీకటిని చీల్చి, సమానత్వాన్ని సాధించేవరకు మన పోరాటం ఆగకూడదు. హక్కుల కోసం నిరంతరం పోరాడే నిబద్ధత మనకు అవసరం. ఎందుకంటే, సమానత్వం అనేది ఏ ఒక్కరికో చెందిన హక్కు కాదు, అది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. అది తాత్కాలిక శాంతిని మాత్రమే ఇస్తుంది.

అణచివేత అనే గడ్డపారను మన సాధికారతతో ఎదురించాలి. మన శక్తిని, సామర్థ్యాన్ని నిరూపించుకోవాలి. అసలైన పరిష్కారం ఆ సమస్య మూలాలను తొలగించడంలో ఉంది. అందుకు, పాలకులు ముందుగా తమ స్వార్థాన్ని పక్కన పెట్టాలి. వ్యక్తిగత ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాలు, కుల ప్రయోజనాల కన్నా జాతి ఆత్మగౌరవమే గొప్పదని భావించాలి. ఓట్ల కోసం తాత్కాలిక ప్రయోజనాలను కాకుండా, నిజమైన సమానత్వాన్ని సాధించేందుకు కృషి చేయాలి. అవినీతి, వివక్ష లేని సమాజాన్ని నిర్మించాలి. అప్పుడే ప్రజల విశ్వాసం తిరిగి వస్తుంది.

నిజమైన నాయకత్వం కేవలం అధికారం చేజిక్కించుకోవడం కాదని, ప్రజల బాధలను అర్థం చేసుకొని, వారికి న్యాయం అందించడమేమా ప్రభుత్వం లక్ష్యం అని భావిస్తోంది. జనగణన, బీసీ రిజర్వేషన్ హామీలు అణగారిన వర్గాల ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిబింబంగా మారుతాయని ఆలోచిస్తుంది. న్యాయంపై సింహనాదం చేస్తూ, విప్లవ జ్వాల రగిలించుకోవాలి. ఎదురుగాలిలోనూ జెండా ఎగిరేలా, సత్యం అనే సైన్యంతో ఎజెండా ముందుకు సాగాలి" అనే నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ బలంగా వినిపించింది. ఇది బీసీ, ఎస్సీ, ఎస్టీల సాధికారతకు, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వారికి సరైన ప్రాతినిధ్యం కల్పించాలనే ఆకాంక్షకు ప్రతీక. ఈ రిజర్వేషన్ల హామీలు కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదు, బహుజన సైద్ధాంతిక నిర్మాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది కావాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రస్తుత ప్రభుత్వం హామీలను ఏ మేరకు అమలు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. రిజర్వేషన్ల పెంపు అనేది చట్టపరంగా, సాంకేతికంగా సంక్లిష్టమైన ప్రక్రియ. అయినా, ప్రజలు తమ పాలకుల నుండి నిజాయితీ, నిబద్ధతతో కూడిన కృషిని ఆశిస్తున్నారు. ఒక సమాజంలో కొంతమంది మాత్రమే అణచివేతకు గురవుతున్నారంటే, అది మొత్తం సమాజానికే ఒక రోగం లాంటిది. ఈ రోగాన్ని నయం చేయడానికి, పాలకులు తమ ఎన్నికల హామీలను నెరవేర్చి, సమాజాన్ని మార్చే దిశగా అడుగులు వేయాలని బహుజన వర్గాలు ఆశిస్తున్నాయి. ఈ లక్ష్యాలను సాధించడంలో ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రజలందరూ భాగస్వాములు కావాలి. హేతువాదంతో, సాధికారతతో ఈ సమాజాన్ని మార్చే దిశగా ప్రయాణం కొనసాగాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను పెంచే అంశం ఎన్నికల హామీలలో ఒక భాగం. ఇది కేవలం ఓట్ల కోసమే కాదు, సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపే లక్ష్యంతో రూపొందించబడింది. తెలంగాణలో ఎన్నో సంవత్సరాలుగా పేరుకుపోయిన కుల, మత వివక్షను తుడిచిపెట్టాలంటే, హేతువాద భావాలను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉంది.

నిజమైన నాయకత్వం అంటే కేవలం అధికారం చేజిక్కించుకోవడం కాదు. అది ప్రజల బాధలను అర్థం చేసుకోవడం, వారికి న్యాయం అందించడం. ఈ లక్షణాలు ఉన్న నాయకత్వం మాత్రమే సమాజాన్ని సరైన మార్గంలో నడిపించగలదు. ప్రజల విశ్వాసాన్ని పొంది, వారి కలలను నిజం చేయగలదు. ఈ కష్టమైన తరుణంలో, మనం అలాంటి నాయకులను ప్రోత్సహించడం, సమర్థించడం చాలా అవసరం. తరతరాలుగా పేరుకుపోయిన కుల, మత వివక్షను తుడిచిపెట్టాలంటే, హేతువాద భావాల వారసత్వాన్ని కొనసాగించాలి. మూఢ నమ్మకాలు, పాత మూస భావాలను రూపుమాపే గళం ప్రతిధ్వనించాలి. అన్యాయంపై సింహనాదం చేస్తూ, విప్లవ జ్వాల రగిలించుకోవాలి. ఎదురుగాలిలోనూ జెండా ఎగిరేలా, సత్యం అనే సైన్యంతో ఎజెండా ముందుకు సాగాలి. రగిలే ఈ జ్వాల, బహుజన సైద్ధాంతిక నిర్మాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది కావాలి. ఈ లక్ష్యాలను సాధించడంలో ప్రతి ఒక్కరం భాగస్వాములం కావాలి. సాధికారతతో, హేతువాదంతో ఈ సమాజాన్ని మార్చే దిశగా అడుగులు వేయాలి.

సమాజం శతాబ్దాలుగా అనేక వివక్షలు, అసమానతలతో బాధపడుతోంది. ఈ చీకటిని చీల్చి, అందరికీ సమాన అవకాశాలు కల్పించే బహుజన సైద్ధాంతిక నిర్మాణం నేటి అవసరం. ఈ గొప్ప లక్ష్యాన్ని సాధించాలంటే, ముందుగా మనం మన వ్యక్తిగత స్వార్థాన్ని తాకట్టు పెట్టి, జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలి. అప్పుడే ఒక బలమైన, ఏకీకృత సమాజం ఆవిర్భవిస్తుంది. అణచివేతకు గురైన గుండెల్లో ఆశా జ్వాలలు రగిలించకపోతే, ఆ జ్వాలలే తిరుగుబాటు జ్వాలలుగా మారి మొత్తం వ్యవస్థను దహించేస్తాయి. ఈ వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. లేకపోతే, వారు నిప్పు కణికల మీద నిద్రపోతున్నట్టే లెక్క. నిజమైన మార్పు వారి స్వార్థాన్ని విడిచిపెట్టినప్పుడే సాధ్యమవుతుంది. ఇది కేవలం ఒక హెచ్చరిక కాదు, మన దేశ భవిష్యత్తును కాపాడే ఒక ఆవశ్యకత.

# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

**మహా:** బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన ఆడే గజేందర్ డోలు చప్పుడు, వాయిద్యాలతో, ఆదివాసీ గిరిజన సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికిన గుడిహత్నూర్ మండలంలోని మాచాపూర్ గ్రామ ఆదివాసీలు... ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు చూపించిన ప్రేమ ఆదరణ ఎప్పటికీ మర్చిపోనని వారికి ఎల్లవేళలా సేవచేయడానికి ముందుటానని అన్నారు. అలాగే ప్రతి గూడెంలో తండాల్లో అభివృద్దే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆదివాసులను అక్కున చేర్చుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఆదివాసులంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక గౌరవం అని, తెలంగాణలోని ప్రతి గూడెంలో, తండాల్లో అభివృద్దే లక్ష్యంగా ప్రజా పాలన మన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని తెలిపారు.మీకు ఏ అవసరం ఉన్న ఎల్లపుడు నేను అందుబాటులో ఉంటానని ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే దాని పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.

## కిలా వరంగల్ తహసిల్దార్ ఇండ్లలో
# ఏసీబీ సోదాలు

- హనుమకొండ, ఖమ్మంలో ఏక కాలంలో దాడులు
- అక్రమాస్తుల పై ఆరాతీస్తున్న ఏసీబీ అధికారులు



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా లోని ఖిలావరంగల్ మండల తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంటి పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు చేశారు. హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఆయన ఇంటి పై వరంగల్ ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సోదాలు జరిపారు. తహసిల్దార్ నాగేశ్వరరావు సొంత జిల్లా ఖమ్మం జిల్లా తోపాటు ఎమ్మార్వో కు సంబంధించిన ఏడు ప్రాంతాలలో ఏకకాలంలో ఏసీబీ దాడులు చేశారు. బండి నాగేశ్వర్ రావు గతంలో ధర్మసాగర్, కాజీపేట, హసన్ పర్తి మండలాల్లో తహసిల్దారుగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల పై ఏసీబీ అధికారులు ఏకకాలంలో హనుమకొండ ఖమ్మంలోని ఎమ్మార్వో నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వరంగల్ మండలం తహశీల్దార్ బండి నాగేశ్వరరావు ఆదాయ వనరులకు అసమాన ఆస్తుల కేసు నమోదైందని ఆయన తన సర్వీసులో అవినీతి కార్యకలాపాలు అనుమానాస్పద మార్గాలకు పాల్పడి ఆదాయ వనరులకు మించి ఆస్తులను సంపాదించారని ఇందుకు సంబంధించిన అసమాన ఆస్తులు ఉన్నట్లు ప్రాథమికంగా వెల్లడైంది. 1) రూ. 1,15,00,000/ విలువైన ఇంటి ఆస్తులు, 2) రూ.17 ఎకరాల 10 గుంటల విలువైన వ్యవసాయ భూమి పత్రాలు. 1,42,98,500, 3) 70 తులాల బంగారు ఆభరణాలు 23,84,700 4) 1,791 గ్రాముల.. రూ 92,000 బరువున్న వెండి వస్తువులు, 5) వాహనాలు (నాలుగు చక్రాల వాహనాలు 2, ద్విచక్ర వాహనం 1 రూ. 34,78,000.. 6) చేతి గడియారాలు 23 రూ. 3,28,195 తోపాటు 7) 16,43,803 రూ విలువగల గృహోపకరణాలు గుర్తించబడిన మొత్తం ఆస్తుల విలువ రూ. 5,02,25,198..లుగా అధికారులు వెల్లడించగా అదనపు ఆస్తుల వివరాల కోసం క్షేత్రస్థాయిలో దర్యాప్తు కొనసాగుతుందని ప్రస్తుత మార్కెట్ విలువలు ప్రభుత్వ విలువ కంటే గణనీయంగా ఎక్కువగా ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఈ కేసులో ఏవొ ను అరెస్టు చేసి, వరంగల్ లోని ఎస్పీఈ ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరు పరుస్తామని ప్రకటనలో ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# బోథ్ కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు జరిగాయి. గుడిహత్నూర్ మండలంలోని మాచాపూర్ గ్రామ ఆదివాసీలు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. వారందరికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఆదివాసీలు చూపించిన ప్రేమ ఆదరణ ఎప్పటికీ మర్చిపోనని వారికి ఎల్లవేళలా సేవచేయడానికి ముందుటానని గజేందర్ అన్నారు. అలాగే ప్రతి గూడెం తండాల్లో అభివృద్దే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆదివాసులను అక్కున చేర్చుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఆదివాసులంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక గౌరవముందన్నారు. ఏ అవసరం ఉన్న ఎల్లపుడు తాను అందుబాటులో ఉంటానని ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే దాని పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## జిల్లాలోని రైతులకు సరిపడా యూరియా, ఎరువుల నిల్వలు
### మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి భుక్యా ఛాత్రు

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలోని రైతులకు సరిపడా యూరియా, ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి భుక్యా ఛాత్రు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాటికి వివిధ మండలాలలో రిటైలర్ లలో మొత్తం 289.7 మెట్రిక్ టన్నుల యూరియా, 454.97 మెట్రిక్ టన్నుల డి.ఎ.పి., 391.8 మెట్రిక్ టన్నుల ఎం.ఓ.పి., 3982.425 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 367.25 ఎస్.ఎస్.పి. మొత్తంగా 5486.145 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. హోల్ సేల్‌గా 12.735 మెట్రిక్ టన్నుల యూరియా, 25 మెట్రిక్ టన్నుల డి.ఎ.పి., 276.7 మెట్రిక్ టన్నుల ఎం.ఓ.పి., 337.1 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 48.5 ఎస్.ఎస్.పి. మొత్తంగా 687.3 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మార్కెఫెడ్ బఫర్లో 110 మెట్రిక్ టన్నుల యూరియా, 124.35 మెట్రిక్ టన్నుల డి.ఎ.పి., 144.35 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ మొత్తంగా 268.7 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కమీషనర్ రిజర్వ్ పూల్లో 299.5 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో మొత్తంగా 711.935 మెట్రిక్ టన్నుల యూరియా, 604.32 మెట్రిక్ టన్నుల డి.ఎ.పి., 668.5 మెట్రిక్ టన్నుల ఎం.ఓ.పి., 4463.88 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 415.75 ఎస్.ఎస్.పి. మొత్తంగా 6741.645 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల కొరకు రైతులు ఆందోళన చెందవలసిన అవసరం స్పష్టం చేశారు. ఎరువుల కొరత ఉందని కొంతమంది చేస్తున్న ప్రచారం ప్రజలు నమ్మకూడదని వివరించారు.

# కాళేశ్వరంలో గోదావరి నది ఉగ్రరూపం
### డేంజర్ లెవెల్ కు దగ్గరగా వరద ప్రవాహం



**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది ప్రాణహిత, గోదావరి నదుల కలయిక త్రివేణి సంగమ తీరంలో డేంజర్ లెవల్ కు దగ్గరగా వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సాయంత్రం గోదావరి నది 12.550 మీటర్ల ఎత్తులో వరద ఉధృతి కొనసాగుతూ ఉండడంతో డేంజర్ లెవెల్ కు దగ్గరగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఎగువ ప్రాంతంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి వరద ప్రవాహం వస్తుండడం, మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది వరద ఒకేసారి పెద్ద ఎత్తున వస్తుండడంతో కాళేశ్వరం లో రెండు నదుల కలయికతో గోదావరి పరవళ్ళు తొక్కుతోంది. వీఐపీ ఘాట్, పుష్కర ఘాట్లలో మెట్లను త్రాగుతూ గోదావరి వరద కొనసాగుతోంది. గోదావరి ఒడ్డున కొన్ని వ్యాపార దుకాణాల్లోకి వరద నీరు చేరింది. మిగతా వ్యాపారస్తులు దుకాణాలను ఖాళీ చేశారు. లక్ష్మీ బ్యారేజ్ మేడిగడ్డలో రాత్రి 9 గంటలకు 10,43,840 క్యూసెక్కులు, అన్నారం సరస్వతి బ్యారేజీలో 8,79,855 క్యూసెక్కులు, సుందిళ్ల పార్వతి బ్యారేజీలో 8,02,856 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉన్నట్లు బ్యారేజ్ ల నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.





## వరద బాధితులకు
# కంది భరోసా
### ఆదిలాబాద్ రూరల్ మండలంలో విస్తృత పర్యటన

పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దు

అధికార యంత్రాంగం రైతులకు అండగా నిలవాలి

ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల భారీ వర్షాల ధాటికి దెబ్బ తిన్న పంటపొలాలను పరిశీలించారు. బాధిత రైతులకు ధైర్యం చెప్పారు. ప్రతీ రైతును ప్రభుత్వం తప్పకుండ ఆదుకుంటుందని భరోసా కల్పించారు. జిల్లా అధికారయంత్రాంగం రైతులకు అండగా నిలవాలని, అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. పిప్పల్ దరి లో పంట నష్టపోయిన పేద బాధిత రైతు సరిపే కైలాష్ కు తక్షణ సాయం కింద 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణ రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కంది శ్రీనివాసరెడ్డిని కలిసిన లారీ ఓనర్ల సంఘం నూతన కార్యవర్గ బాధ్యులు

**ఆదిలాబాద్ మహా :** లారీ ఓనర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆయనను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. అధ్యక్షులు కసావత్ జైసింగ్ ,జనరల్ సెక్రటరీ షౌకత్, ఉపాధ్యక్షులు విజయ్, గౌరవాధ్యక్షులు సికిందర్ అలీ ఇతర సభ్యులు శాలువాలతో సత్కరించారు. నూతన కార్యవర్గాన్ని కంది శ్రీనివాస రెడ్డి సత్కరించి అభినందనలు తెలిపారు.



## కంది శ్రీనివాస రెడ్డి పరామర్శ- ఆర్థిక సాయం



**ఆదిలాబాద్ మహా :** బాధిత కుటుంబాలకు అండగా ఉంటారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. ప్రమాదంలో గాయపడినవారికి అనారోగ్యంతో బాధ పడుతున్నవారికి ధైర్యం చెబుతారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్ దరి లో పర్యటించిన కంది శ్రీనివాస రెడ్డి ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్త మెస్రం చిత్రు నివాసాన్ని సందర్శించారు. ప్రమాదంలో కాలు విరిగి బాధ పడుతున్న చిత్రు సతీమణిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షింస్తూ వైద్యఖర్చుల నిమిత్తం 5వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు.

## అక్రమంగా ఓటర్ నమోదు చేసుకున్న
# వారిని తొలగించాలి
### మందమర్రి ఎంపీడీవో, తాసిల్దార్ లకు వినతి




**మందమర్రి, మహా :** మందమర్రి మండలంలోని వివిధ పంచాయతీలలో అక్రమంగా ఓటర్ నమోదు చేసుకున్న వారిని తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఐదు ప్రధాన పార్టీలకు చెందిన నేతలు మందమర్రి ఎంపీడీవో, తాసిల్దార్ లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్, సిపిఐ, బీ.ఎస్.పి నాయకులు వేల్పుల రవి, గిర్నాటి జనార్ధన్, భానోత్ నీలయ్య, కామెర దుర్గరాజు, ముల్కల రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలిటీలో నివాసితులుగా రికార్డులకు ఉన్న కొంతమంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు అక్రమంగా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించడం చట్ట విరుద్ధమని ఘాటుగా వాక్యానించారు. ఇలాంటి చర్యలకు పాల్పడడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమే అవుతుందని మండిపడ్డారు. ఈ విధానాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమ ఓటర్లతో సమీకరణలు చేసి, ప్రజాస్వామ్యాన్ని మోసం చేయాలనే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. తమ ఫిర్యాదు పై విచారణ జరిపి పట్టణ నివాసుల పేర్లను వెంటనే ఓటర్ లిస్టు నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా నుండి ఆయా పేర్లను తొలగించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



## గణనాథుడికి కంది శ్రీనివాస రెడ్డి
# దంపతుల పూజలు

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లాలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో ప్రతిష్టించిన విఘ్నేశ్వరుడిని శనివారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. గణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం గణనాయకునికి హారతి తో పాటు నైవేద్యాలు సమర్పించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని వినాయకుడిని ప్రార్థించారు.






## కే.కే.ఓ.సి. ప్రాజెక్టు ఓబి పనులను
# వేగవంతం చేపించాలి

**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా కే.కే.ఓ.సి. ప్రాజెక్టు ఓబి పనులను వేగవంతం చేపించాలని జిఎం పి అండ్ పి సాయి బాబా, జిఎం (ఓసిపిఎస్) సూర్యనారాయణ రాజు, జిఎం (అండర్ గ్రౌండ్ మైన్స్) రమురామారెడ్డి, జిఎం (ఎమ్మెస్) రవి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓబి కాంట్రాక్టర్ పనిచేయకపోవడం వలన జిఎం (ఓసిపిఎస్) ఇంతకు ముందు ఒక్క షోవెల్, నాలుగు డంపర్, ఒక్క డ్రిల్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉత్పత్తి పెంపుకు అదనంగా ఒక్క షోవెల్, నాలుగు డంపర్లు, ఒక్క డోజర్ కూడా ఇస్తామని వివరించారు. అనంతరం జిఎం (పి.అండ్.పి) మాట్లాడుతూ, ఆఫ్‌లోడింగ్ కాంట్రాక్టర్ వచ్చిన తర్వాత కూడా డిపార్టుమెంట్ ఎక్విట్ మెంట్ ద్వారా కొంత భాగం మట్టిని వెలికితీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే.కే.ఓ.సి. ప్రాజెక్ట్ అధికారి మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజినీర్ వెంకట వంశీధర్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రజలందరి బాధ్యత
### వాహన ప్రాథమిక సూత్రాలను పాటించాలి .. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రజలందరి బాధ్యతని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కార్యాలయ భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, లతో పాటు రెవెన్యూ, పోలీసు, రవాణా, రోడ్లుభవనాలు శాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఆర్.టి.సి. అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్) లను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రహదారులపై పశువుల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు పశువులను తరలించేందుకు జిల్లా కేంద్రంలో గోశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించడంపై కఠిన చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ 2వ సారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేయాలని అధికారులకు తెలిపారు. భవనాలలో సెల్లార్ ను పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించాలని, అద్దెకు ఇవ్వకూడదని అన్నారు. జాతీయ రహదారి 63కి ఇరువైపులా షోల్డర్లు, వంతెనలు, కల్వర్టులకు పెయింటింగ్, క్రాస్‌డ్రైనేజ్ వ్యవస్థ, నాలుగు వరుసల కాన్ఫిగరేషన్ నవీకరణ అంశాలపై పర్యవేక్షించాలని చెప్పారు. మూలమలుపుల వద్ద వేగనిరోధకాలు, వేగ పరిమితి, యు టర్న్, ఇతర సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. రహదారుల మరమ్మత్తులు జరిగే ప్రాంతాలలో సూచిక బోర్డుల ఏర్పాటు, ప్రమాదాల నియంత్రణలో భాగంగా విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టాలని వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు, ఇతర వాహనచోదకులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగ నియంత్రణ, సూచిక బోర్డులు, రేడియమ్స్, లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో అవసరమైన అటవీ అనుమతులు పొందాలని తెలిపారు. జిల్లాలోని జన్నారం మండలం పొనకల్, శ్రీరాంపూర్ ఆర్.టి.సి. బస్టాండ్ లో బస్సులు రోడ్డుపై నిలుపడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, బస్టాండ్ లోపలికి వెళ్ళి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచిర్యాల పట్టణం, మందమర్రి మండల కేంద్రం లోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిల వద్ద రోడ్లపై కూరగాయల విక్రయం ద్వారా వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల, బెల్లంపల్లి ఎ.సి.పి.లు ప్రకాష్, రవికుమార్, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పట్టా పేరుతో భూములు
# లాక్కుంటే ఊరుకోం

**అజ్మీరా పూల్ సింగ్ నాయక్**

**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని నిమ్మగూడెం గ్రామానికి సంబంధం లేని ముక్తేదారు జగన్నాధ రావు నిజామాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి, వారి బంధువుల పేర్ల పై గిరిజనులను తెలియకుండా 1956 సంవత్సరంలో 600 ఎకరాల భూమిని పట్టా చేసుకున్న పట్టాలను రద్దు చేయాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాల ద్వారానే భూమిని సాధించుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా పూల్ సింగ్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం నిమ్మగూడెం గ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించి మాట్లాడారు. ఈ భూమిలో నిమ్మగూడెం గ్రామానికి చెందిన గిరిజన, హరిజన, బలహీన వర్గాలకు చెందిన రైతులు భూమిని సాగు చేసుకుంటున్నారని జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వారి పట్టాలను రద్దుచేసి ముఖ సర్వే చేసి ఇక్కడ ప్రజలకు పట్టాలు అందించాలని అన్నారు. ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక కరీంనగర్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ అయితు బాపు మాట్లాడుతూ ప్రజల ఆర్థిక పరిస్థితులు చూసి కొంతమంది మాజీ నక్సలైట్లు రంగ ప్రవేశం చేసి పట్టాదారులకు తొత్తులుగా వ్యవహరిస్తూ తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకొని డబ్బులు పంచుతున్నారని మీ పద్ధతులను మార్చుకోకుంటే ప్రజాక్షేత్రంలో చూసుకుంటామని బాపు పేర్కొన్నారు. కొంతమంది నిమ్మగూడెం గ్రామానికి చెందిన మధ్యవర్తులను డబ్బు ఆశ చూపి ప్రజలను మోసం చేస్తున్నారని వారు ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడుతూ కొమరం భీమ్ అంబేద్కర్ వారసులమని నిమ్మగూడెం వాసులు గత భూ పోరాటంలో భూ కబ్జా చేసిన ఆంధ్ర వారిని తరిమికొట్టిన చరిత్ర ఈ గ్రామానికి ఉందని గత చరిత్రను మర్చిపోకుండా భూమినీ మన నుండి లాక్కుని ప్రయత్నం చేస్తున్న వారిని తరిమికొట్టే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు గతంలోనే 28 మంది ఆదివాసులపై పోలీసులు కేసులు పెట్టారని నేడు కూడా నలుగురు పై కేసు పెట్టి బెదిరిస్తున్నారని కేసు పెట్టిన ఆజంనగర్ గ్రామానికి చెందిన వారు కేసును వెనక్కి తీసుకోవాలని కోరారు. ఇక్కడ ప్రజల నుండి భూమి లాక్కునే ప్రయత్నం చేస్తున్న కుట్ర దారులైన ముత్తారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు. మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని 1956 లో అక్రమ పట్టాలను చేసుకున్న వారి పేర్లపై పట్టాలను రద్దు చేయించి, ముఖ సర్వే చేయించి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి. ఈ కార్యక్రమంలో. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రామగిరి రాజు. తెలంగాణ రైతు పోరాట వేదిక అధ్యక్షులు దాసరి రమేష్‌తో పాటు గ్రామానికి చెందిన 200 మంది ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఓ ద్వేష పూరిత పార్టీ

- మోదీ తల్లి పై అవమానకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు
- రాహుల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ మహా;** దేశం అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ ని అకారణంగా దూషించడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆయన తల్లి పై కాంగ్రెస్ కార్యకర్తలు కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మండిపడ్డారు. శనివారం వరంగల్ చౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ ఓ ద్వేషపూరిత పార్టీ అని, దానికి విలువలంటూ లేవని విద్వేషాలను రెచ్చగొట్టడమే ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నైజం అని ధ్వజమెత్తారు. ఓటర్ అధికార్ యాత్ర పేరుతో బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమాల్లో ఆ పార్టీ కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ ఆయన తల్లి పై అభ్యంతరకర రీతిలో వ్యాఖ్యలు చేయడం, దానిని రాహుల్ గాంధీ ఖండించకపోవడం ఆయన విష సంస్కృతికి నిదర్శనమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విదేశీ సంస్కృతిలో పుట్టి పెరిగిన రాహుల్ గాంధీకి తల్లి విలువ ఏం తెలుసు అని ఎద్దేవా చేశారు. ఓట్ల రాజకీయాల కోసం కన్నతల్లి ని రాజకీయాల్లోకి లాగి పైశాచికత్వ ఆనందాన్ని రాహుల్ గాంధీ పొందుతున్నారని ఘాటుగా విమర్శించారు. జరిగిన దానికి బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ వెంటనే ప్రధాని మోదీ ఆయన తల్లికి క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. దేశ ప్రధాని అవుతానని కలలు కంటున్న రాహుల్ కు రానున్న రోజుల్లో కనీసం డిపాజిట్ కూడా రాదని అన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ మరీ ఇంతగా దిగజారుతున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాసు శిల్పా, మహిళా మోర్చా నాయకురాలు పిట్టల సరస్వతి, మార్త ఉషారాణి, స్వర్ణ, రాజేశ్వరి, ఉమాదేవి, స్వరూప,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, ఫైర్తా ఆనంద్, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుట్కా విక్రయిస్తున్న
# వ్యక్తి అరెస్ట్

**2 లక్షల విలువైన నిషేధిత ఉత్పత్తులు సీజ్**

**వరంగల్ మహా;** అక్రమంగా గుట్కా విక్రయిస్తున్న వ్యక్తిని పర్కాలలో టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పర్కాలకు చెందిన రేపాక అశోక్ (42) వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 2,01,600 విలువైన గుట్కా, తంబాకు వంటి నిషేధిత ఉత్పత్తులను టాస్క్ ఫోర్స్ బృందం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఏసీపీ ఎ మధుసూధన్ పర్యవేక్షణలో ఈ దాడులు నిర్వహించారు. నిందితుడి నుంచి జేకే టొబాకో,ఆర్ ఆర్ టొబాకో, స్వాగత్ గోల్డ్, వి1 టొబాకో, మిరాజ్ టొబాకో, అనార్ టొబాకో వంటి నిషేధిత ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అశోక్ ను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చర్యల నిమిత్తం పర్కాల పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

# నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయండి

**కమిషనర్ తో కలిసి మేయర్ నగరంలోని నిమజ్జన ప్రాంతాల పరిశీలన**



**వరంగల్ మహా;** గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం బల్దియా పరిధిలోని బెస్థం చెరువు, ఉర్సు చెరువు, బంధం చెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతం గా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిమజ్జనం ప్రశాంతం గా జరిగేలా బల్దియా తరపున అన్ని ఏర్పాట్లు చేయాలని ట్రాష్ కలెక్టర్ యంత్రం ద్వారా చెరువుల్లో కొనసాగుతున్న పూడిక తీత, గుర్రపు డెక్క తొలగింపు పనులను ఇరువురు పరిశీలించారు. ఇరిగేషన్ వారి సహకారంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. బల్దియా ద్వారా రహదారుల పై గ్రావెల్, తగినంత లైటింగ్, శానిటేషన్ లో భాగం గా ఎప్పటికపుడు నిమజ్జన పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణ చందర్, అరుణ విక్టర్, మరుపల్ల రవి, మానస రాంప్రసాద్, సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఎం హెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్ ఈ ఈ శంకర్, బల్దియా ఈ ఈ లు సంతోష్ బాబు, మాధవి లత, డి ఈ లు రవికిరణ్, సతీష్, రాగి శ్రీకాంత్, ఇరిగేషన్ డి ఈ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధులు దివ్యాంగుల దరఖాస్తులను
# త్వరగా పరిష్కరించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో అందించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వయోవృద్ధులు, దివ్యాంగులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వృద్ధులు, దివ్యాంగుల నుంచి పలు దరఖాస్తులు స్వీకరించారు. గత నెల ప్రజావాణి సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారం పై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ ప్రజావాణిలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



## పులి దాడిలో మృతి చెందిన
# లేగ దూడకు పరిహారం పంపిణీ

**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం ఎడ్లపల్లి గ్రామానికి చెందిన గుర్రం రాజయ్య లేగ దూడ జూన్ 20న బొగ్గుల వాగు సమీప ప్రాంతంలో పులి దాడిలో చనిపోగా అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కొయ్యూరు అటవీ అధికారులు పంపగా భూపాలపల్లి ఎఫ్ డి ఓ అప్పలకొండ ఆధ్వర్యంలో మంజూరైన పరిహారం చెక్కును కొయ్యూరు రేంజ్ అధికారి జి రాజేశ్వరరావు, సెక్షన్ అధికారి ఎంఏ ఇంతియాజ్, బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు శనివారం రూ30 వేల చెక్కును అందించారు.

## బాబోయ్ కుక్కలు..
# కండలు పీకేస్తున్నాయి

**గ్రేటర్ వరంగల్ పరిధిలో వీధి కుక్కల వీరంగం**

బెంబేలెత్తుతున్న చిన్నా పెద్దా.. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు
స్టెరిలైజేషన్ పేరున రూ.2.21 కోట్ల ఖర్చు ఫలితం శూన్యం



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో వీధి కుక్కల బెడద తీవ్రతరమైంది. ఇంట్లో నుంచి బయటికి అడుగు పెట్టాలంటే బాబోయ్ కుక్కలు అంటూ చిన్న పిల్లల నుండి పెద్దల వరకు బెంబేలెత్తుతున్నారు. నగరంలోని పలు డివిజన్ల పరిధిలో ఉన్న కాలనీల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలను చూసి చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో చాలా సార్లు అభం శుభం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు మనం చూసాం. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మునిసిపాలిటీ తో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో ఇలాంటి ఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. మునిసిపాలిటీలోని ఏ వార్డులో చూసినా కుక్కల గుంపు కనబడుతోంది. కాలనీలో ఒంటిరిగా వెళ్లాలంటేనే కాలనీవాసులు జంకుతున్నారు. కుక్కల నియంత్రణకు బల్దియా రూ. కోట్లు ఖర్చు పెడుతున్నా, వాటి సంఖ్య మాత్రం నియంత్రణ కావడం లేదు. ఆపరేషన్లకు ఒకటి మాత్రమే యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) ఉండటం, మరోటి ప్రతిపాదనలు కాగితాల వరకే పరిమితం కావడంతో ఒవైపు స్టెరిలైజేషన్ చేయిస్తుంటే, మరోవైపు కుక్కల సంతానోత్పత్తి పెరుగుతూనే ఉంది. ఫలితంగా గ్రేటర్ పరిధిలో వీధి కుక్కల సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికే నగరంలో తరచూ డాగ్ బైట్ కేసులు దడపుట్టిస్తున్నాయి. ఉదయం వేళ పిల్లలు స్కూల్ బస్సుల కోసం కాలనీల్లో విద్యార్థులు వేచి ఉంటున్న సందర్భంలో కుక్కల గుంపును చూసిన విద్యార్థులు భయపడుతున్నారు. నగరంలోని పలు కాలనీలలో రాత్రి సమయాలల్లో 10కి పైగా ఉన్న కుక్కల గుంపులు నడిచివెళ్లే వారిపైనే కాకుండా బైక్ లపై వెళ్లే వారి పై కూడా దాడి చేస్తున్నాయి. దీంతో బైక్ లు స్కిడ్ అయి గాయాల పాలవు తున్న ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. వరంగల్ హన్మకొండ జిల్లాల కేంద్రాలతో పాటు జిల్లాల్లోని గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొందని, కుక్కల బారి నుంచి రక్షించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఐదేండ్లలో రూ.2.21 కోట్లు... వరంగల్ ట్రైసిటీలో కుక్కల సమస్య తీవ్రంగా ఉండడంతో 2018లో గ్రేటర్ పరిధి చింతగట్టు సమీపంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నచోట్ల నుంచి వాటిని పట్టుకెళ్లి, స్టెరిలైజేషన్ చేయడం, వాటికి మూడు రోజులపాటు ఆహారం అందించి వ్యాక్సిన్లు ఇవ్వడం తదితర పనుల బాధ్యతను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. కాగా 2018లో నామమాత్రంగానే స్టెరిలైజేషన్ ప్రక్రియ జరగగా, అప్పట్లో స్టెరిలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినందుకు ఒక్కో కుక్కకు మొదట్లో రూ. 750 చొప్పున ఏజెన్సీకి చెల్లించారు. ఆ తర్వాత ఏజెన్సీ డిమాండ్ మేరకు 2022 నుంచి దాదాపు రూ. 850కి పెంచారు. ఇదిలా ఉంటే చింతగట్టు సమీపంలో ఏర్పాటు చేసిన ఏబీసీ సెంటర్ లో రోజుకు సుమారు 22 నుంచి 25 కుక్కలకు స్టెరిలైజేషన్ నిర్వహించే అవకాశం ఉంది. ఇలా ఇప్పటి వరకు నగరంలోని 26,916 కుక్కలకు స్టెరిలైజేషన్ నిర్వహించారని తెలుస్తోంది. అయితే ఒక వైపు కార్పొరేషన్ అధికారులు కోట్లు ఖర్చు చేసి కుక్కల సంఖ్యను తగ్గిస్తున్నామని చెబుతుంటే... నిజానికి మాత్రం ఆ సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. గతంలో నగరంలో కుక్కల సంఖ్య లెక్కించగా 28వేలకు పైగా ఉన్నట్లు తేలింది. దీంతో వాటికి ఆపరేషన్లు నిర్వహిస్తూ వస్తున్నారు. 2023 వరకు 21,036 కుక్కలకు ఆపరేషన్లు పూర్తి చేశారు. 2024లో మరోసారి కుక్కల లెక్కలు తీయగా, స్టెరిలైజేషన్ నిర్వహిం చాల్సిన కుక్కల సంఖ్య 28.460 ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా కుక్కల్లో 8 నుంచి 10వారాల్లో సంతానోత్పత్తి ఉంటుందని, దీంతోనే వాటి సంఖ్య పెరుగుతూ వస్తోందని వెటర్నరీ ఆఫీసర్లు చెబుతుండడం గమనార్హం. కోట్లు ఖర్చు చేసినా ఆశించిన మేరకు ఫలితాలను సాధించలేకపోతున్నారు. పెరుగుతున్న కుక్కల సంఖ్యను తగ్గించాలంటే నియంత్రణ ఒక్కటే మార్గమని జంతు కుంటుంబ నియంత్ర(ఏబీసీ) ఆపరేషన్ల సంఖ్యను, సంరక్షణ కేంద్రాలను పెంచి దాని ద్వారానే కొంత మేరకు కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు.




## మహిళా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**హన్మకొండ మహా;** మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అభిప్రాయపడ్డారు. భీమారం ఎం టి ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన గీతాంజలి మహిళా డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించలంటే దృఢమైన సంకల్పం, అంకితభావంతో కష్టపడి పనిచేయాలన్నారు. ఆడపిల్లలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా ఉండాలంటే ఉన్నత చదువులు చదివి స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళల సంక్షేమ ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మీకు ఏ సమస్య వచ్చినా ఆ సమస్య పరిష్కారానికి నేనెప్పుడూ ముందుంటానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ బులియన్ మర్చంట్ ఆధ్వర్యంలో
# మహా అన్నదాన కార్యక్రమం




**వరంగల్ మహా;** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ ఆర్ఎన్ టి రోడ్డు లో ది వరంగల్ బులియన్ జ్యూయలరీ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం వినాయక మండపంలో ఏర్పాటు చేసిన గణనాథునికి నగర మేయర్ గుండు సుధారాణి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమం లో మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు గుండు శ్రీనివాస్, స్టేట్ జాయింట్ సెక్రటరీ తోట హరీష్, గౌరవ అధ్యక్షులు పడిశాల నాగరాజు, ఉపాధ్యక్షులు వంగాల రవి, మాజీ కోశాధికారి గార్లపాటి శ్రీనివాస్, సభ్యులు నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశాయిపేట రోడ్‌లో
# నిత్యాన్నదాన కార్యక్రమాలు




**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం గణపతికి ప్రత్యేక పూజలు అలాగే తొమ్మిది రోజులపాటు నిత్యాన్నదానం, సాయంత్రం అల్పాహార వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా దేశాయిపేట రోడ్ లోని 80 ఫీట్ రోడ్డు దగ్గర గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండపం దగ్గర శనివారం కామగోని సమ్మక్క వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించగా దాదాపు 900 మందికి పైగా భక్తులు పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం సంఘం సభ్యులు సమ్మక్క ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్, గణపతి వర్తక సంఘం అధ్యక్షుడు వేల్పుగొండ శ్రీనివాస్, తోపాటు వర్తక సంఘాల సభ్యులు, దాతలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఆర్టిఐ కమీషనర్లు



**వరంగల్ మహా;** కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని తెలంగాణా రాష్ట్ర ఆర్ టిఐ కమీషనర్ లు పి.వి శ్రీనివాసరావు, బి. అయోధ్య రెడ్డి లు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన కమీషనర్లకు ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామల సునీత ఆలయ కార్య నిర్వహణాధికారి సహాయ కమీషనర్, ఆర్ టిఐ సిబ్బంది, దేవాలయ పర్యవేక్షకులు కాంతికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోయి.. బీసీ ఉద్యమ సాహిత్యం పుస్తకావిష్కరణ



**హన్మకొండ మహా;** కాకతీయ యూనివర్సిటీ బీసీ టీచర్స్ అసోసియేషన్ (బీసీ టాక్) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఆవరణలో ప్రముఖ రచయిత డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ రచించిన సోయి బీసీ ఉద్యమ సాహిత్యం అనే పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పుస్తక రచయిత డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 1990 లో మండల్ ఉద్యమం అనంతరం ప్రస్తుతం జరుగుతున్నది మండల్.. 2 అని బీసీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడంతో పాటు రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని జ్ఞానాన్ని ప్రబోధించే పుస్తకమే ఈ సోయి అని వివరించాడు. ఈ కార్యక్రమంలో బీసీ టాక్ బాధ్యులు డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్, డాక్టర్ బ్రహ్మయ్య, సతీష్, గౌడ్ డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ నాగయ్య, డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ కృష్ణ సుమంత్, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్యామ్ సుందరాచారి డాక్టర్ గోపి డాక్టర్ మోహన్ డాక్టర్ మహేందర్, డాక్టర్ వి కుమార్ పాల్గొన్నారు.

## జాదరావుపేట గ్రామంలో భూసేకరణ గ్రామసభ



**కాటారం, మహా :** చిన్న కాలేశ్వరం నీటి పథకంలో భాగంగా భూసేకరణ కోసం మండలంలోని జాదరావుపేట గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అధ్యక్షత వహించగా మండల తహసిల్దార్ నాగరాజు రైతుల పేర్లను వినిపించారు. గూడూరు చెరువు విస్తరణ కోసం 3 ఎకరాల 23 గుంటల భూమి కోసం అలైన్మెంట్ ను రూపొందించారు. గూడూరు చెరువు ద్వారా నీటి పంపిణీ కోసం చేస్తున్న అలైన్మెంట్ లో మార్పు చేయాలని రైతులు అధికారులను కోరారు. రైతుల విజ్ఞప్తిని ప్రభుత్వానికి పంపించనున్నట్లు తహసిల్దార్ నాగరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ వెంకన్న, నీటిపారుదల శాఖ అధికారులు, సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్, గ్రామ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.



## బంగారం ధరలు మరింత పెరుగుతాయా..
### నిపుణులు ఏం చెబుతున్నారంటే?

బంగారం ధరలు రోజురోజుకి అమాంతం పెరుగుతూనే ఉన్నాయి. వెండి రేటు కూడా జీవితకాల గరిష్టాలకు చేరుకుంది. ఈ రోజు (ఆగస్టు 30) 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1640 పెరిగి రూ. 1,04,950 వద్దకు చేరింది. కేజీ వెండి రూ. 1,31,000 వద్ద ఉంది. ఈ నెల ప్రారంభంతో పోలిస్తే.. ఈ ధరలు చాలా ఎక్కువ అని తెలుస్తోంది. ఈ సంవత్సరం భారతదేశంలో బంగారం ధరలు దాదాపు 32 శాతం పెరిగాయి. ఇది పెట్టుబడిదారులకు లాభదాయకంగా ఉన్నప్పటికీ, కొనుగోలుదారులకు కొంత భారమైపోయింది. జనవరిలో పది గ్రాముల గోల్డ్ రూ. 80,000 నుంచి ప్రారంభమై.. మార్చి నాటికి రూ.90,000 చేరుకుంది. కాగా ఇప్పుడు ఈ ధరలు లక్ష రూపాయలు దాటేసింది. గ్లోబల్ మార్కెట్లో మే 2025 ప్రారంభంలో బంగారం ధర ఔన్సుకు 3392 డాలర్ల వద్ద ఉండేది. జూన్ మధ్య నాటికి ఇది 3368 డాలర్ల వద్దకు చేరుకుంది. గోల్డ్ రేటు విపరీతంగా పెరగడానికి రాజకీయ ఉద్రిక్తతలు, బలహీనపడుతున్న యూఎస్ డాలర్ విలువ మాత్రమే కాకుండా.. రూపాయి విలువ తగ్గడం కూడా ప్రధాన కారణమైందని నిపుణులు చెబుతున్నారు. ఇండియా బులియన్ & జ్యువెలర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అండ్ ఆస్పెక్ట్ గ్లోబల్ వెంచర్స్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ 'అక్ష కాంబోజ్' మాట్లాడుతూ.. పండుగ సీజన్‌లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. ప్రపంచ అనిశ్చితి, బలహీనపడుతున్న డాలర్ ఇండెక్స్ మధ్య పెట్టుబడిదారులు బంగారం వైపు ఆకర్షితులయ్యారు. భారత ఎగుమతులపై అమెరికా విధించిన.. 50 శాతం సుంకాలు కూడా పసిడి డిమాండును మరింత పెంచిందని అన్నారు. బంగారం ధరలు పెరగడానికి సీజనల్ డిమాండ్ మరో కీలకమైన అంశం. ప్రపంచంలో రెండవ అతి పెద్ద బంగారం వినియోగదారు అయిన భారతదేశంలో పండుగలు.. వివాహాల సీజన్ మొదలైపోయింది. దీనివల్ల కూడా బంగారం కొనుగోళ్లు పెరుగుతాయి, ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. ధర ఎంత పెరిగినా.. బంగారంపై పెట్టుబడి ఎప్పటికి మంచి లాభాలను తెస్తుందనేది మాత్రం వాస్తవం.

## బీఎస్ఎన్ఎల్ పే యూపీఐ వచ్చేస్తుంది!

ప్రభుత్వం టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆన్‌లైన్ సేవల్లో ప్రైవేటు కంపెనీలతో పోటీ పడుతోంది. ప్రిపెయిడ్, పోస్ట్ పెయిడ్, డేటా ప్లాన్లతో ప్రైవేటు సంస్థలకు దీటుగా దూసుకెళుతున్న బీఎస్ఎన్ఎల్ (BSNL) మరో ముందడుగు వేయబోతోంది. వినియోగదారుల కోసం త్వరలో కోసం కొత్త సర్వీసును అందుబాటులోకి తెచ్చేందుకు సన్నద్ధమవుతోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఆర్థిక లావాదేవీలు, బిల్లుల చెల్లింపుల కోసం ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం లాంటి ప్రైవేటు డిజిటల్ యాప్‌లను ఎక్కువగా వాడుతున్నారు. బీఎస్ఎన్ఎల్ కూడా త్వరలోనే యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను ప్రారంభించనుంది. బీఎస్ఎన్ఎల్ పే పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ (భీమ్) యూపీఐ ఆధారంగా బీఎస్ఎన్ఎల్ పే (BSNL Pay) సేవలను వినియోగించుకునేలా దీన్ని రూపొందిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.




దీపావళి నాటికి ప్రారంభం!

బీఎస్ఎన్ఎల్ పే సేవలు వినియోగదారులకు దీపావళి (Diwali) నాటికి అందుబాటులోకి వస్తాయని మీడియాలో వార్తలు వస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ పే అనేది ప్రత్యేకమైన యాప్ కాదు. బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్‌లో భాగంగానే ఇది ఉంటుంది. భీమ్ యూపీఐ ద్వారా దీని సేవలను యూజర్లు వినియోగించుకోవచ్చు.

**ఎలాంటి సేవలు అందిస్తుంది?**

ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం (Paytm) మాదిరిగానే బీఎస్ఎన్ఎల్ పే ద్వారా అన్ని రకాల ఆన్‌లైన్ చెల్లింపులు చేయగలుగుతారు. సెల్ఫ్ కేర్ యాప్ వినియోగదారులు సులువుగా ఈ సేవలు ఉపయోగించుకోవచ్చు. యూజర్లకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందించడంతో పాటు, దేశంలో వేగంగా విస్తరిస్తున్న యూపీఐ చెల్లింపుల మార్కెట్‌లో తమ దైన ముద్ర వేయాలని బీఎస్ఎన్ఎల్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ పే సేవలు అందుబాటులోకి వస్తే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం లాంటి ప్రైవేటు డిజిటల్ యాప్‌లకు గట్టి పోటీ ఎదురవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.




### లాంచ్‌కు సిద్ధమవుతున్న
## వియాత్నం బ్రాండ్ కార్లు

వియాత్నం కంపెనీ విన్‌ఫాస్ట్.. భారతదేశంలో తన VF6, VF7 ఎలక్ట్రిక్ కార్లను 2025 సెప్టెంబర్ 6న ప్రారంభించనున్నట్లు ధృవీకరించింది. 2025 భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో కనిపించిన ఈ కార్లు త్వరలోనే రోడ్డుపై కనిపించనున్నాయి. కాగా కంపెనీ ఈ కార్ల కోసం ప్రీబుకింగ్‌లను జులై 15 నుంచి స్వీకరించనున్నట్లు సమాచారం. వినియోగదారులు రూ. 21,000 రీఫండబుల్ డిపాజిట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా విన్‌ఫాస్ట్ అవుట్‌లెట్‌లలో బుక్ చేసుకోవచ్చు. డెలివరీలు త్వరలో ప్రారంభమవుతాయి. ప్రీమియం ఎలక్ట్రిక్ మొబిలిటీని కోరుకునే భారతీయ కొనుగోలుదారులను.. లక్ష్యంగా చేసుకుని విన్‌ఫాస్ట్ VF6 & VF7 లాంచ్ చేయడానికి సిద్ధమైంది. ఈ కార్లు లెవెల్ 2 ఏడీఏఎస్ ఫీచర్స్ కలిగి ఉంటాయని, పనోరమిక్ గ్లాస్ రూఫ్‌లను కూడా పొందుతాయని కంపెనీ వెల్లడించింది. విన్‌ఫాస్ట్ తన సేల్స్, సర్వీస్, స్పేర్స్ నెట్‌వర్క్‌ను విస్తరించడంతో భాగంగా.. ఢిల్లీ, బెంగళూరు, పూణే, హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై వంటి ప్రధాన కేంద్రాలతో సహా 27 నగరాల్లో 32 షోరూమ్‌లను ఏర్పాటు చేయడానికి 13 డీలర్లతో భాగస్వామ్యం కలిగి ఉంది. అంతే కాకుండా ఛార్జింగ్ స్టేషన్స్ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి.. కంపెనీ రోడ్‌గ్రిడ్, మైటీవీఎస్, గ్లోబల్ అష్యూర్‌లతో కూడా ఒప్పందం కుదుర్చుకుంది.

## భారతీయ కుబేరులు.. కోట్ల విలువైన ప్రైవేట్ జెట్‌లు

మిలినీయర్ అంటే.. వారు ఎలాంటి విలాసవంతమైన జీవితం గడుపుతారో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. లగ్జరీ వాహనాల నుంచి విశాలమైన భవనాల వరకు.. విలాసవంతగా ఉండేలా చూసుకుంటారు. కొంతమంది ధనవంతులు మరింత ప్రత్యేకంగా ఉండటం కోసం ఖరీదైన ప్రైవేట్ జెట్‌లను ఉపయోగిస్తారు. ఈ కథనంలో ప్రముఖ భారతీయుల అత్యంత ఖరీదైన ప్రైవేట్ జెట్‌ల గురించి తెలుసుకుందాం.





**ముఖేష్ అంబానీ - బోయింగ్ 737 మ్యాక్స్9**

బోయింగ్ 737 మ్యాక్స్9 అనేది భారతదేశంలోని ఖరీదైన విమానాల్లో ఒకటి. ఇది ప్రపంచంలోని అత్యంత విలాసవంతమైన ప్రైవేట్ జెట్‌లలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకుంది. బోయింగ్ 737 మ్యాక్స్9 ఎగిరే ప్యాలెస్ లాంటిది. దీని లోపల మాస్టర్ బెడ్‌రూమ్, లివింగ్ రూమ్, కిచెన్ వంటివన్నీ ఉన్నాయి. 19 మంది ప్రయాణించడానికి అనుకూలంగా ఉండే ఈ ప్రైవేట్ జెట్ ధర రూ. 1000 కోట్ల కంటే ఎక్కువని సమాచారం.

**విజయ్ మాల్యా - ఎయిర్‌బస్ ఏ319**

భారతదేశానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త విజయ్ మాల్యా కూడా ఖరీదైన ప్రైవేట్ జెట్ కలిగి ఉండేవారు. 2012 నుంచి ఆర్థిక కుంభకోణాలు.. వివాదాలలో చిక్కుకున్న మాల్యా, ప్రస్తుతం లండన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈయన వద్ద ప్రస్తుతం ఈ జెట్ లేదని తెలుస్తోంది. కానీ ఇది 18 మంది ప్రయాణికులు వెళ్ళడానికి అనుకూలంగా ఉంటుంది. ఒక బార్, డైనింగ్ ఏరియా, బెడ్‌రూమ్ వంటివి కలిగిన ఈ జెట్ ధర రూ. 700 కోట్ల కంటే ఎక్కువ అని తెలుస్తోంది.

**అమితాబ్ బచ్చన్ - బాంబార్డియర్ ఛాలెంజర్ 300**

బాలీవుడ్ నటుడు.. కౌన్ బనేగా కరోడ్‌పతి హోస్ట్ అమితాబ్ బచ్చన్ వద్ద 'బాంబార్డియర్ ఛాలెంజర్ 300' ఉంది. ఈ జెట్ విశాలమైన క్యాబిన్, ఇతర సౌకర్యాలు ఉన్నాయి. దీని ధర రూ. 220 కోట్ల కంటే ఎక్కువ అని తెలుస్తోంది.

**రతన్ టాటా - డస్సాల్ట్ ఫాల్కన్ 2000**


టాటా సన్స్ మాజీ ఛైర్మన్ 'రతన్ టాటా' డస్సాల్ట్ ఫాల్కన్ 2000 విమానం ఉపయోగించేవారు. ఇందులో విలాసవంతమైన సదుపాయాలు అందుబాటులో ఉండేవి. ఈ జెట్ ధర రూ. 300 కోట్ల కంటే ఎక్కువ అని సమాచారం.

**అదార్ పూనవాలా - గల్ఫ్‌స్ట్రీమ్ G550**


సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈఓ అదార్ పూనవాలా.. వద్ద గల్ఫ్‌స్ట్రీమ్ G550 అనే ఖరీదైన విమానం ఉంది. దీని విలువ రూ. 500 కోట్ల కంటే ఎక్కువే. ఇది చాలా స్టైలిష్ జెట్. అదార్ పూనవాలా తన అభిరుచికి తగిన విధంగా దీనిని నిర్మించుకున్నారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## అమెరికాలో నడి రోడ్డుపై గట్కా విన్యాసాలు..
### సిక్కు వ్యక్తిని కాల్చి చంపిన పోలీసులు



లాస్‌ఏంజెలెస్: అమెరికాలో నడి రోడ్డుపై ప్రాచీన యుద్ధ విద్యను ప్రదర్శించిన ఓ సిక్కు వ్యక్తిని అమెరికా పోలీసులు కాల్చిచంపారు. జూలై 13వ తేదీన చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీని లాస్‌ఏంజెలెస్ పోలీసు విభాగం తాజాగా విడుదల చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. లాస్‌ఏంజెలెస్‌లోని క్రిప్టో డాట్ కామ్ అరెనా వద్ద గుర్‌ప్రీత్ సింగ్(35) వేటకత్తిని పట్టుకుని తిప్పుతుండగా హెచ్చరించామని, లక్ష్య పెట్టకపోగా తమపైకి దాడికి యత్నించాడని పోలీసులు అంటున్నారు. ఈ క్రమంలో జరిపిన కాల్పుల్లో అతడు చనిపోయాడని చెబుతున్నారు. పోలీసులు చెబుతున్న వేటకత్తి, పంజాబ్ ప్రాచీన యుద్ధ విద్యలో భాగమైన గట్కాలో వాడే రెండంచుల కత్తి. సిక్కు మత పరమైన, సాంస్కృతిక కార్యక్రమాలప్పుడు దీనిని ప్రదర్శిస్తుంటారు. అయితే, షార్టు, తలపాగాను ధరించిన ఓ వ్యక్తి రెండడుగుల పొడవైన కత్తితో బెదిరించాడంటూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో తమ సిబ్బంది రద్దీగా ఉండే ఆ ప్రాంతానికి వెళ్లారని పోలీసు విభాగం తెలిపింది. 'కత్తిని నేలపై పడేసి, లొంగిపోవాలని పదేపదే కోరగా, నిరాకరించిన అతడు కత్తితో నాలుకను కోసుకునేందుకు యత్నించాడు. సమీపంలోకి చేరుకుంటున్న పోలీసులపైకి బాటిల్ విసిరి, తన కారులో అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించాడు. పోలీసులు వెంబడించగా నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ పలు వాహనాలను ఢీకొట్టాడు. వేగంతో వెళ్తూనే కారులో నుంచి కత్తిని చూబుతూ బెదిరించాడు. కత్తిని విసిరేందుకు యత్నించగా కాల్పులు జరపాల్సి వచ్చింది. బుల్లెట్ గాయాలైన అతడు అనంతరం ఆస్పత్రిలో కన్నుమూశాడు'అని పోలీసులు వివరించారు.

## ఏడేళ్ల తర్వాత.. చైనాలో ల్యాండ్ అయిన ప్రధాని మోదీ




**తియాంజిన్:** ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల జపాన్ పర్యటనను ముగించుకుని.. చైనాకు చేరుకున్నారు. షాంఘై సహకార సంస్థ సదస్సు (SCO)లో పాల్గొనేందుకు ఆయన తియాంజిన్‌లో ల్యాండ్ అయ్యారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో తియాంజిన్ వేదికగా నిర్వహించనున్న ఎస్‌సీవో సదస్సుకు హాజరుకానున్నారు. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్ సహా ఆయా దేశాధినేతలతో భేటీ కానున్నారు. ప్రపంచ ఆర్థిక క్రమం(ఆర్డర్)లో స్థిరత్వం తీసుకురావాలంటే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్, చైనా తప్పనిసరిగా కలిసి పనిచేయాలన్న ప్రధాని మోదీ.. జపాన్ పత్రిక యోమియురి షిమ్‌బన్‌కు శుక్రవారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన సంగతి తెలిసిందే. భారత్-చైనా సంబంధాల ఆవశ్యకతను మోదీ వివరించారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సౌభాగ్యం కోసం ఆసియాలో దిగ్గజ దేశాలైన భారత్, చైనా మధ్య స్నేహ సంబంధాలు బలపడాల్సిందేనని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సాగిస్తున్న టారిఫ్‌ల యుద్ధాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్-చైనాలు ఒక్కటైతే ఇరుదేశాలతోపాటు ప్రపంచ దేశాలకు సైతం మేలు జరుగుతుందని మోదీ చెప్పారు జపాన్‌లోని మియాగీ ప్రిఫెక్చర్‌లోని సెండాయ్ నగరంలో ప్రధాని మోదీ సెమీకండక్టర్ ప్లాంట్‌ను సందర్శించారు. ప్రధాని మోదీ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తయారీ, మొబిలిటీ, నెక్స్ట్ జనరేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లు వంటి వ్యాపారాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలంటూ ఆయన సూచించారు. భారత్ ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా తన జపాన్ పర్యటన కొనసాగిందని ప్రధాని మోదీ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. 2018లో చైనాలో చివరిసారి ప్రధాని మోదీ పర్యటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతున్న వేళ.. ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.


### ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి..
## ఎగసిపడుతున్న మంటలు



**కైవ్:** రష్యా ఉక్రెయిన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ఉక్రెయిన్‌లోని డ్నిప్రోపెట్రోవ్స్క ప్రాంతం శనివారం తెల్లవారుజామున భీకర దాడికి గురైందని స్థానిక అధికారులు తెలిపారు. డ్నిప్రో, పావ్‌లోగ్రాడ్‌లలో కూడా దాడులు జరిగాయని పేర్కొన్నారు. 'ఈ ప్రాంతం భారీ దాడుల్లో చిక్కుకుంది. పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి'అని గవర్నర్ సెర్హి లైసాక్ 'టెలిగ్రామ్'లో పేర్కొన్నారు. రష్యాలోని క్రాస్నోడార్ క్రైలోని చమురు శుద్ధి కర్మాగారాన్ని ఉక్రేనియన్ డ్రోన్లు ఢీకొట్టిన అనంతరం రష్యా ఈ దాడులకు పాల్పడింది. 'కైవ్ ఇండిపెండెంట్' నివేదిక ప్రకారం, స్థానిక సమయం ప్రకారం తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో పేలుళ్లు సంభవించాయని, డ్రోన్లు ఎగురుతున్నాయని స్థానికులు తెలిపారు. సోషల్ మీడియాలో ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. చమురు శుద్ధి కర్మాగారంలో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నట్లు ఆ వీడియోల్లో కనిపిస్తోంది.

## ట్రంప్ నిజంగానే క్షేమమా? వైట్‌హౌజ్ గప్‌చుప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) ఎక్కడ?.. నిత్యం తనదైన శైలి ప్రకటనలు, నిర్ణయాలు, సోషల్ మీడియాలో పోస్టింగులతో హడావిడి చేసే ట్రంప్ ఉన్నట్లుండి సైలెంట్ అయిపోయారు. పైగా 79 ఏళ్ల వయసున్న ఆయన అనారోగ్యంపై ఇటీవల వార్తలు ఎక్కువయ్యాయి. దీనికి తోడు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అవసరమైతే తానే అధ్యక్ష బాధ్యతలు చేపడతానంటూ ప్రకటన చేశారు. ఈ వరుస పరిణామాల నడుమ.. ట్రంప్ మిస్సింగ్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.



గత 24 గంటలుగా సోషల్ మీడియా మామూలుగా ఊగిపోవడం లేదు. ఏకంగా ట్రంప్ ఈజ్ డెడ్ అంటూ ఓ ట్రెండ్ సైతం నడుస్తోంది. పోను పోను ఆ ట్రెండ్ మరింత దారుణంగా మారింది. ట్రంప్ చనిపోయాడనే వార్త ధృవీకరించినవాళ్లకు డాలర్లు ఇస్తామంటూ పలువురు వ్యంగ్యంగా పోస్టులు పెడుతున్నారు. తాజాగా.. ట్రంప్ మీడియా ముందుకురాలేదు. ఏదైనా చెప్పాలనుకుంటే తన 'ట్రూత్' ద్వారానే వెల్లడిస్తున్నారు. అయితే.. వారాంతమైన ఆగస్టు 30, 31 తేదీల్లోనూ ఎలాంటి పబ్లిక్ ఈవెంట్లు వైట్‌హౌస్ షెడ్యూల్‌లో లేకపోవడంతో అనుమానాలు మరింత పెరిగాయి. ట్రంప్ అనారోగ్యంపై వార్తలు వస్తున్న నేపథ్యంలో.. ఆయన చేతిపై గాయాలు కనిపించడంతో పలువురు సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటివరకు వైట్‌హౌజ్‌గానీ, ఆయన వ్యక్తిగత సిబ్బందిగానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాకుంటే.. తన మనవరాలు కై మాడిసన్ ట్రంప్ (Kai Madison Trump) కలిసి వైట్‌హౌజ్ సౌత్ లాన్‌లో ఆయన గోల్ఫ్ ఆడినట్లు ఓ వీడియో వైరల్ అవుతోంది. ఆ సమయంలో అక్కడికి వచ్చినవాళ్లకూ ఆయన కరచలనం చేస్తూ కనిపించినట్లు ఆ వీడియోలో ఉంది. అయితే అది తాజా వీడియోనేనా? అనేది ధృవీకరణ కావాల్సి ఉంది. "గత 24 గంటలుగా ట్రంప్ కనిపించలేదు. మరో రెండు రోజులు కూడా ఎలాంటి పబ్లిక్ మీటింగ్‌లు లేవు. అసలు ఏం జరుగుతోంది?" అని ఓ వ్యక్తి ఎక్స్‌లో పోస్టు పెట్టడంతో ఈ వ్యవహారం మొదలైంది. మరోవైపు ఇవన్నీ ఊహాగానాలే అని.. ఆయన ఎంతో చురుగ్గా ఉన్నారని ఆయన ట్రూత్ సోషల్ పోస్టులు చెబుతున్నాయని మరికొందరు అంటున్నారు. కుట్రపూరితంగానే ప్రచారం జరుగుతోందని ఆయన మద్దతుదారులు అంటున్నారు. సెప్టెంబర్ 1న కార్మిక దినోత్సవం ఉన్నందున ఆయన ఈ వీకెండ్‌లో ఎలాంటి బహిరంగ కార్యక్రమాలకు హాజరుకావడం లేదని కారణాలుగా పలువురు చెబుతున్నారు. భారత్+రష్యా+చైనా = ట్రంప్‌నకు పీడకల అంటూ నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు. భవిష్యవాణిగా పేరొందిన సింప్సన్ కామిక్ సిరీస్‌ను ఉద్దేశించి.. ట్రంప్ ప్రాణాలతో లేకపోయి ఉండొచ్చు అని సెటైరిక్ మీమ్స్ వేస్తున్నారు. ఇంకొందరు ఓ అడుగు ముందుకు వేసి.. జేడీ వాన్స్, ఎలాన్ మస్క్‌లలో ఎవరు తదుపరి అధ్యక్షుడు అయితే బాగుంటుందంటూ పోల్ పెట్టారు కూడా.

ఈ మధ్యకాలంలో 79 ఏళ్ల ట్రంప్ అనారోగ్యంపై తరచూ వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇటీవల ట్రంప్ చేతిపై గాయంతో కనిపించారు. గతంలో ఈ గాయాన్ని దాచడానికి ఆయన చేతికి మేకప్ వేసుకొని కనిపించారు. దీనిపై ట్రంప్ వైద్యుడు సీన్ బార్బబెల్లా స్పందించారు. ఆ గాయం నిజమేనని అంగీకరించారు. తరచుగా కరచాలనం చేయడం వల్ల, ఆస్ప్రిన్ వాడటం వల్ల ఇలా జరిగిందని వెల్లడించాడు. అయితే.. ట్రంప్ పూర్తి ఆరోగ్యంగానే ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. గోల్ఫ్ ఆడిన వీడియో అధికారికమని ధృవీకరణ అయితే.. ఊహాగానాలకు తెర పడినట్లే!.



# మహావతార్ నరసింహ కలెక్షన్స్.. దేశాన్ని ఏకం చేసిన గర్జన

'మహావతార్ నరసింహ' కలెక్షన్స్ పరంగా రికార్డ్ క్రియేట్ చేసింది. జులై 25న విడుదలైన ఈ యానిమేటెడ్ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించింది. సినిమా రిలీజై ఆరు వారాలు పూర్తి అయినప్పటికీ కొన్నిచోట్ల హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతుంది. దీంతో ఈ చిత్రం కలెక్షన్స్ పరంగా అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక పోస్టర్‌ను పంచుకుంది. 'మహావతార్ నరసింహ' చిత్రం రూ. 300 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరిపోయింది. ఇండియా బిగ్గెస్ట్ యానిమేటెడ్ చిత్రంగా నిలిచిందంటూ నిర్మాణ సంస్థ హోంబాలే ఫిల్మ్స్ ప్రకటించింది. దేశాన్ని ఏకం చేసిన నరసింహ గర్జన అంటూ పేర్కొంది. శ్విన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధవాన్, కుశల్ దేశాయ్, చైతన్య దేశాయ్ సంయుక్తంగా 'మహావతార్ నరసింహ' యానిమేటెడ్ చిత్రాన్ని తెరకెక్కించారు. తెలుగులో గీతా ఆర్ట్స్ బ్యానర్ నుంచి అల్లు అరవింద్ విడుదల చేశారు. కేవలం తెలుగులోకే రూ. 47 కోట్ల నెట్ రాబట్టి రికార్డ్ క్రియేట్ చేసింది.

# మొన్న డైరెక్షన్.. ఇప్పుడు రొమాన్స్?



దర్శకులు అనగానే చాలావరకు తెర వెనకే ఉంటారు. అప్పుడప్పుడు లేదంటే కెరీర్‌లో ఓ దశ దాటిన తర్వాత నటులుగు మారుతుంటారు. కానీ తమిళ స్టార్ డైరెక్టర్ లోకేశ కనగరాజ్ మాత్రం కెరీర్ పీక్‌లోనే హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఈ విషయం చాన్నాళ్ల క్రితమే బయటకొచ్చినప్పటికీ ఇప్పుడు మరో క్రేజీ అప్‌డేట్ వినిపిస్తుంది. ఇది తెలిసిన నెటిజన్లు షాకవుతున్నాయి. ఇంతకీ ఏంటి విషయం?

'కూలీ' సినిమాతో రీసెంట్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చిన డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్.. తర్వాత ఏ మూవీ చేస్తాడా అని అభిమానులు ఆలోచిస్తున్నారు. లెక్క ప్రకారం 'ఖైదీ 2' చేయాలి. కానీ ఆమిర్ ఖాన్‌తో ఓ సూపర్ హీరో మూవీ చేస్తాడనే రూమర్ వినిపిస్తుంది. ఈ విషయాలపై క్లారిటీ రావాలి. మరోవైపు తమిళ దర్శకుడు అరుణ్ మాతేశ్వరన్ తీయబోయే కొత్త చిత్రంతో లోకేశ్ కనగరాజ్ హీరోగా మారబోతున్నాడు. ఇప్పటికే లోకేశ్.. మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ తీసుకుంటున్నాడని తెలుస్తోంది.


ఇప్పుడు ఈ సినిమాలో హీరోయిన్‌గా రచిత రామ్‌ని ఎంపిక చేశారని సమాచారం. ఈ మధ్య లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'కూలీ'లో ఈమె.. కల్యాణి అనే పాత్ర చేసింది. మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. కన్నడలో స్టార్ హీరోయిన్ అయిన రచిత.. 'కూలీ'తో దక్షిణాదిలో ఫేమ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు లోకేశ్ సరసన హీరోయిన్‌గా ఈమెనే తీసుకున్నారట. ఇది కన్ఫర్మ్ అయిపోయిందని, త్వరలో ప్రకటన రానుందని టాక్. కొన్నాళ్ల క్రితం ఓ ఆల్బమ్ సాంగ్‌లో లోకేశ్ కనగరాజ్, శ్రుతి హాసన్‌తో కలిసి నటించాడు. ఇప్పుడు తన దర్శకత్వంలో యాక్ట్ చేసిన రచితతో నటించబోతున్నాడనమాట.



# పాడె మోసిన అల్లు అర్జున్, చిరంజీవి, రామ్‌చరణ్..

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తల్లి, దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ (94) ఇక లేరు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె శనివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ఆమె మరణవార్త తెలిసిన వెంటనే ముంబై నుంచి అల్లు అర్జున్, మైసూర్ నుంచి రామ్ చరణ్ హుటాహుటిన హైదరాబాద్ వచ్చేశారు. నానమ్మ పార్థివదేహాన్ని చూసి అల్లు అర్జున్ భావోద్వేగానికి లోనయ్యాడు. పలువురు సినీ ప్రముఖులు అల్లు అరవింద్ నివాసానికి వచ్చి కనకరత్నమ్మ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. కాగా కోకాపేటలోని అల్లు వ్యవసాయ క్షేత్రంలో అల్లు కనకరత్నమ్మ అంత్యక్రియలు జరిగాయి. అల్లు అర్జున్, అల్లు అయాన్, చిరంజీవి, రామ్‌చరణ్... కనకరత్నమ్మ పాడె మోశారు. అల్లు అరవింద్.. తల్లికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

## నా తమ్ముడు తారక్ రాజకీయాల్లోకి వస్తాడు



నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు పెద్దఎత్తున నివాళులర్పించారు. 2018లో నల్గొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హరికృష్ణ మరణించిన విషయం తెలిసిందే. కొద్దిరోజులుగా జూనియర్ ఎన్టీఆర్ పేరు సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తారక్‌పై చేసిన కామెంట్లతో అభిమానులు భగ్గుమన్నారు. సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఆ తర్వాత క్షమాపణలు చెప్తారని అందరూ భావించారు. అదీ లేకపోవడంతో వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెప్తామని తారక్ ఫ్యాన్స్ వార్నింగ్ ఇచ్చారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ఎన్టీఆర్ రాజకీయ ఎంట్రీ గురించి ఆయన సోదరి నందమూరి సుహాసిని క్లారిటీ ఇచ్చారు. హరికృష్ణకు సుహాసిని నివాళులర్పించారు. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ రాజకీయ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందని మీడియా ప్రశ్నించగా ఆమె ఇలా చెప్పారు. 'ప్రస్తుతం ఎన్టీఆర్ సినిమా పనుల్లో పూర్తిగా నిమగ్నమై ఉన్నారు. అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా రాజకీయాల్లోకి వస్తాడు.' అని ఆమె క్లారిటీ ఇచ్చారు. నందమూరి హరికృష్ణ వారసుడిగా రాజకీయ ఎంట్రీ ఉంటుందా అనే ప్రశ్నకు ఆమె ఈ సమాధానం చెప్పడం విశేషం. దీంతో తారక్ అభిమానులు సంతోషిస్తున్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలను నెట్టింట షేర్ చేస్తున్నారు.

# అల్లు అరవింద్ తల్లి మృతి.. వైఎస్ జగన్ సంతాపం



దివంగత నటుడు అల్లు రామలింగయ్య సతీమణి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తల్లి కనకరత్నమ్మ మరణం పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతాపం తెలిపారు. 'దివంగత సీనియర్ నటులు అల్లు రామలింగయ్య సతీమణి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తల్లి కనకరత్నమ్మ గారు మృతి చెందడం బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. కాగా, గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న బాధపడుతున్న కనకరత్నమ్మ (94) శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఈ రోజు మధ్యాహ్నం కోకాపేటలో కనకరత్నమ్మ అంత్యక్రియలు జరగనున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# పేకాట రాయుళ్ల అరెస్ట్ రిమాండ్

## మహేశ్వరం ఎస్ఓటి సిఐ రవికుమార్



**రంగారెడ్డి జిల్లా మహా:** గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై శుక్రవారం రాత్రి మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి సాహేబ్ గూడ వ్యవసాయ భూమిలో, గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఓటి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో దండు లక్ష్మయ్య, పోతురాజు నర్సింహ, బొమ్మరాజు సురేష్, అల్వాల రాంచంద్రారెడ్డి, గుండ్ల శ్రీనివాస్, పాతూరి శర్వందాగౌడ్, నరేందర్, నారని పరమేష్ గౌడ్ లను అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి రూ.లక్ష 4వేల నగదుతో పాటు, కార్డులు, 8 మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఓటి సిఐ రవికుమార్ వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్ కు తరలించామని పోలీసులు తెలిపారు.

# ఐదు లక్షల బంగారు గణేశుడుని నిమజ్జనం.. వింతగా ఉందన్న భక్తులు



**రంగారెడ్డి జిల్లా మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వింత ఘటన చోటుచేసుకుంది. హస్తినాపూర్ కు చెందిన భక్తుడు వినాయకుడి మెడలో వేసిన ఐదు తులాల బంగారు ఆభరణం మర్చి, నగర శివారు తుర్కయంజాల్ మాసబ్ చెరువులో నిమజ్జనం చేశారు. వినాయకుని మెడలో బంగారు ఆభరణం ఉన్న విషయం గుర్తుకు రావడంతో, జరిగిన విషయాన్ని మున్సిపల్ నోడల్ అధికారులు వినయ్, శ్రీధర్రెడ్డికి తెలుపగా, సిబ్బంది వెంటనే రంగంలోకి దింపగా, జేసీబీ సహాయంతో శ్రమించి మళ్ళీ విగ్రహాన్ని బయటికి తీశారు. ఐదు తులాల ఆభరణాన్ని వారికి అందించారు. దీంతో ఒకే గణేశుని రెండుసార్ల నిమజ్జనం చేసినట్లు, వింతగా ఉందని పలువురు అన్నారు. తులం బంగారం విలువ లక్షలలో ఉండడంతో, పోయిందనుకున్న బంగారం తిరిగి దక్కడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. సదరు వ్యక్తి మున్సిపల్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్వాడి కేంద్రాలలో ప్రీ ప్రైమరీ బోధనపై అవగాహన

**కాటారం, మహా :** మహాదేవపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోగల కాటారం మండలం దేవరాంపల్లి,అల్లీపూర్, పలిమెల సెక్టార్లో అంగన్వాడీ సెంటర్ల నందు ప్రారంభ బాల్య సంరక్షణ విద్యా విధానం శనివారం నిర్వహించారు.ప్రీప్రైమరీ విద్య విధానం పటిష్ఠ పరచడానికి ప్రతి అంగన్వాడీ సెంటర్ నందు ప్రతి నెల నాల్గవ శనివారం నిర్వహిస్తున్నట్లు అంగన్వాడీ టీచర్లు ఎల్ కమలాదేవి, ఎం శ్రీలతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ బాల్య దశ ప్రాముఖ్యత మరియు మెదడు అభివృద్ధి ల గురించి తల్లిదండ్రులకు వివరించడం జరిగింది . అలాగే ప్రారంభ సంవత్సరాలలో ప్రేరణ ప్రాముఖ్యత ఏంటి,? అభివృద్ధి అవకాశాలను కల్పించడంలోని ఇంటి వాతావరణము పాత్ర, మరియు తల్లి దండ్రుల పాత్ర గురించి కూడా వివరించడం జరిగినది. అలాగే పిల్లల పెరుగుదలను వారి అభివృద్ధి మైలురాళ్లు వివరించడం జరిగినది అంగన్వాడీ కేంద్రంలో జరిగే ప్రీస్కూల్ యొక్క ఆవశ్యకతను అనుభవం ద్వారా నేర్చుకోవడం వలన కలిగే లాభాలను తల్లి దండ్రులకు వివరించడం జరిగినది.. పిల్లలు అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటల ద్వారా నేర్చుకున్న విద్యను తల్లిదండ్రుల ముందు ప్రదర్శించారు. అందరు తల్లిదండ్రులు భాగస్వామ్యం అయ్యేలా ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని,ప్రతి నెల జరుపుకునే ఇట్టి కార్యక్రమంలో ముఖ్యంగా పిల్లల తల్లి దండ్రులు పాల్గొనే విధంగా ఈ కార్యక్రమాలు వెళ్తామని అంగన్వాడీ టీచర్లు తెలిపారు ప్రీస్కూల్ పిల్లల రోజువారి కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లలకి నేర్పించే విద్యా విధానాన్ని తల్లిదండ్రులకు డిస్ప్లేద్వారా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సి డి పి ఓ రాధిక, సూపర్ వైజర్ వీణ, అంగన్వాడీ లాభోక్తులు, ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు, కార్యదర్శి, ఏ ఎన్ ఎం, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పోలీస్ స్టేషన్ లో ప్రతిష్ఠించిన గణపతిని నిమజ్జనం చేసిన పోలీసులు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏఎస్పీ శుభం

**వరంగల్ మహా;** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు పూర్తయిన సందర్భంగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడిని శనివారం సాయంత్రం వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పీ శుభం నగరాలే విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్ అన్న ప్రసాద ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా నిమజ్జన ఊరేగింపులో ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ , పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో సాంప్రదాయ దుస్తులను ధరించి పల్లెటూరు వాతావరణం తలపించేలా ఎడ్ల బండిని వివిధ పూలతో అందంగా అలంకరించి దానిపై మట్టి వినాయకుడిని భజనలతో ఊరేగించి ఉర్సు గుట్ట చెరువులో నిమజ్జనం చేయడం జరిగింది.

# ప్రభుత్వ ఉద్యోగంలో ఉత్తమ సేవలందించిన సమ్మయ్య

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

### సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**హన్మకొండ మహా;** రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో దేవులపల్లి సమ్మయ్య ఉత్తమ సేవలను అందించారని, వారి సేవలు అభినందనీయమని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టరేట్ లో తహసీల్దారు హోదాలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన సమ్మయ్యకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, ఇతర అధికారులు, టీజీవో టీఎన్జీవో సంఘాల నాయకులు పాల్గొని పదవీ విరమణ పొందిన దేవులపల్లి సమ్మయ్యకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపి సమ్మయ్య దంపతు లకు కలెక్టర్ జ్ఞాపికను అందజేశారు. అనంతరం రెవెన్యూ, ఇతర అధికారులు శాఖల అధికారులు, టీజీవో, టీఎన్జీవోస్ సంఘాల నాయకులు శాలువాలు పూలమాలలతో సమ్మయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీవో, టీఎన్జీవోస్ రాష్ట్ర, జిల్లా నాయకులు జగన్మోహన్ రావు, రాజేష్ కుమార్ గౌడ్, మాధవరెడ్డి, తదితరులతో పాటు వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# కోర్టులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు కోర్టులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ చెప్పారు. శనివారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆమనగల్లు సహకారం తో ఆమనగల్లు జూనియర్ కోర్టు ఆవరణలో శుద్ధజలాల వాటర్ ప్లాంట్, క్యాంటీన్ జిరాక్స్ సెంటర్, ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన స్థానిక న్యాయమూర్తి స్వరూపతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహానికి ప్రధానన్యాయమూర్తి,న్యాయవాదుల తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆమనగల్లు కోర్టు అభివృద్ధి కోసం పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తిని కోరారు. న్యాయవాదులు అదనపు కోర్టు భవన నిర్మాణం స్థల సేకరణ అదనపు కోర్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ,క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వస్పుల మల్లేష్, మాజీ అధ్యక్షులు మల్లెపల్లి జగన్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, నరేందర్ రెడ్డి, జమీల్ హైమద్, లక్ష్మణ రాజు, మల్లేష్, మధు గౌడ్, గణేష్ గౌడ్, మహేష్, శివకుమార్, శ్రీనివాస్, బిక్య నాయక్, సర్దార్ నాయక్, శ్రీశైలం, మురళి కృష్ణ, సూపరింటెండెంట్ మురళీధర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, కోర్టు సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పి.డి.జి జి. చెన్నకిషన్ రెడ్డి, అధ్యక్షులు కె. గోవర్ధనరెడ్డి,కార్యదర్శి గంపా శ్రీనివాస్, ఓంకారం జులూరు రమేష్,బాలకృష్ణ, చంద్రశేఖర్, యాదయ్య, కొండల్ రెడ్డి, వేణుగోపాల్, చెగూరి వెంకటేశ్, బిచ్చయ్య, గూడె రాజేందర్, జహంగీర్, వినోద్, జల్కం రమేష్ క్లబ్ పి.ఆర్.ఓ పాషా, వైద్య సిబ్బంది, సూపరిండెంట్ వర్ధన్ రాజ్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

# శంషాబాద్ మండల్ ఓటర్ లిస్ట్ తప్పుల తడక సరి చేయండి

## పంచాయతీ కార్యదర్శులతో వాగ్వాదం



**రాజేంద్రనగర్ మహా;** శంషాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ముసాయిదా ఓటర్ లిస్ట్ లో అవుకతావుకలు జరిగాయని. పెద్ద తూప్రా గ్రామానికి సంబంధించిన ప్రవీణ్ కుమార్, నందకిషోర్, మహేష్, ఎండి రఫీ, సాయిబాబా, కరుణ పంచాయతీ కార్యదర్శి శశిధర్ రెడ్డితో వాగ్వాదానికి దిగారు గ్రామస్తులు సంబంధిత గ్రామపంచాయతీ ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. పెద్ద తూప్రా, పెద్ద షాపూర్ తండ గ్రామపంచాయతీ లో ఉండవలసిన ఓటర్ల లిస్ట్ లో పేర్లను తొలగించి ఇష్టానుసారంగా ఒక పార్టీకి అనుకూలంగా ఓట్లు మారుస్తూన్నారని పంచాయతీ కార్యదర్శి లతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. పెద్ద తుప్రర గ్రామంలోఒక కుటుంబ ఓట్లను ఒక వార్డ్ లో నుంచి తొలగించి వేరేవార్డులకు మార్చారు. పెద్ద షాపూర్ తండా లో సొంత గ్రామంలో ఓటు హక్కును తొలగించి వేరే గ్రామంలో ఓటు కల్పించారని గ్రామస్తులు దుయ్యబట్టారు. వెంటనే తప్పులు తడకగా ఉన్న గ్రామపంచాయతీ ఓటర్ లిస్టును సరిచేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్న మండల అభివృద్ధి అధికారికి ఓటర్ లిస్ట్ అవుతవుకలపై ఫిర్యాదులు చేసిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఒక పార్టీకి నేరుగా మండల అధికారులు సాయం చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అవకతవకలపై ఉన్నతాధికారులు కలుగజేసుకొని గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ లిస్ట్ ను సరిచేయాలని కోరారు.

# డబ్బు కోసం మహిళ దారుణ హత్య

## మిస్సింగ్ కేసును హత్యగా చేదించిన పోలీసులు.. నిందితుడి రిమాండ్



**కాటారం,మహా :** సభ్య సమాజం తల దించుకునేలా డబ్బు కోసం కక్కుర్తి పడి, తన జీవితాన్ని మరిచి వృద్ధ మహిళను హత్య చేసి ఎవరికి తెలియకుండా సమాజంలో తిరుగుతున్న వ్యక్తిని మహాదేవపూర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మహాదేవపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ ల కథనం ప్రకారం.. అంబటిపల్లి గ్రామానికి చెందిన వోల్లాల వోల్లాల భాగ్యలక్ష్మి(51) కనిపించడం లేదని కుమారుడు వోల్లాల రవికుమార్ 27/12/2024 నుండి కనపడకుండా పోయిందని జనవరి 12వ తేదీన మహదేవపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అప్పటినుండి దర్యాప్తు చేపట్టిన మహాదేవపూర్ సి ఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఐ పవన్ కుమార్ క్లూస్ టీం ద్వారా వెన్నపురెడ్డి రామయ్య యొక్క సెల్ ఫోన్ సిగ్నల్స్, కాల్ డేటా, సీసీ కెమెరాలు పరిశీలించారు. హత్య చేసి ఏమీ తెలవనట్లుగా తప్పించుకొని తిరుగుతున్న వెన్నపురెడ్డి రామయ్యను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. కేసు వివరాలు ఇలా... వొల్లాల భాగ్యలక్ష్మి భర్త వైకుంఠం చనిపోయి ఒంటరిగా బతుకుతున్న మహిళ వద్ద డబ్బులు ఉన్నవి గమనించిన వెన్నపురెడ్డి రామయ్య డబ్బుల కోసం ఒంటరి మహిళ భాగ్యలక్ష్మిని నమ్మబలికి కమలాపూర్ ఎక్స్ రోడ్ నుంచి కొద్ది దూరంలో అడవిలోకి తీసుకెళ్లి శవాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టి హత్య చేసినట్లు తెలిపారు. తప్పించుకుని తిరుగుతున్న వెన్నపురెడ్డి రామయ్య@రామిరెడ్డిని పోలీసు శనివారం పట్టుకుని రిమాండ్ కు తరలించినట్లూ తెలిపారు. నేరం చేసి తప్పించుకునే ఏ వ్యక్తికైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని సీఐ వెంకటేశ్వర్లు,ఎస్ఐ పవన్ కుమారులు హెచ్చరించారు.



# అసెంబ్లీ సమావేశాల కోసం ముందస్తు అరెస్టులు..?

## ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే అరెస్టులా..?

### అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం..

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్

**రంగారెడ్డి జిల్లా మహా:** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్ అన్నారు. వర్షాకాలం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం సిపిఎం నాయకులను ముందస్తు అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేలు మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కరించడంలో రేవంత్ రెడ్డి సర్కార్ తన చిత్తశుద్ధి చూపిస్తుందని ఎద్దేవ చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతారని ఇలాంటి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. రైతు భరోసా కింద ఇచ్చే పెట్టుబడి సాయం రైతులకు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదు. గ్యాస్ సబ్సిడీ, మహిళ సాధికారిత పథకాలు అమలుకు నోచుకోవడం లేదు. గ్రామాల్లో సర్పంచులు లేక సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రత్యేక అధికారులు గ్రామాలను పర్యవేక్షించడం లేదు. రామోజీ ఫిలిం సిటీ ఆధీనంలో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను త్వరగా తేల్చాలని డిమాండ్ చేశారు. 2007లో దండుమైలారం సర్వే నెంబర్ 174 లో 106 మంది పేద ప్రజలకు ఇంటి పట్టాలు ఇచ్చిన వారికి ఇంటి స్థలం కేటాయించాలని, కప్పపహాడ్ గ్రామంలో 98 ఎకరాలు మిగులు భూమిని సాగు చేసుకున్న ప్రజలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలు, పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముందస్తు అరెస్ట్ అయిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, నాయకులు స్వప్న, అరుణ, యాదగిరి, దశరథ,రామోజీ ఫిలిం సిటీ ఇళ్ల స్థలాల బాధితులు బాలరాజ్, పుష్ప, కాంతమ్మ, బాలమణి, మణెమ్మ, భారతమ్మ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు పలు రాష్ట్రాల సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా నృత్యాలు

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం రామాంజాపుర గ్రామంలో రాయ్ కార్యక్రమంలో పీజేటీయూ కమ్యూనిటీ సైన్స్ కళాశాల విద్యార్థులు ఆకర్షణీయమైన సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. అప్టెక్స్ విభాగం విద్యార్థులు ప్రత్యేకంగా ఫ్యాషన్ షో నిర్వహించి, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ దుస్తులు, ప్రత్యేకమైన చీర కట్టే విధానాలు ప్రదర్శించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా రూపొందిన ఈ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. ఈ ఈ సీఎం విభాగం విద్యార్థులు గ్రామ కేంద్రంలో ఆకస్మికంగా ఫ్లాష్‌మాబ్ (డ్యాన్స్) ప్రదర్శించి, మహిళా సాధికారత, మహిళా శక్తి, మహిళా భద్రతపై బలమైన సందేశాన్ని అందించారు. ఉత్సాహభరితంగా నృత్యం చేస్తూ అందించిన ఈ స్ఫూర్తిదాయక ప్రదర్శనను ప్రేక్షకులు ఘనంగా అభినందించారు.గ్రామ ప్రజలు విద్యార్థుల వినూత్న ఆలోచనలను, సాంస్కృతిక ప్రదర్శనలను ప్రశంసిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ సమాజంలో అవగాహన పెంచటంతో పాటు సాంస్కృతిక విలువలను కూడా బలపరుస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# దాతల చేయూత విద్యార్థుల భవిత

## పాఠశాల అభివృద్ధికి దాతల సహాయం అభినందనీయం: ఎంఇఒ




**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మండలం మండల పరిధిలోని గౌరారం ప్రాథమిక విద్యాభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని ఎంఈఓ పాండు అన్నారు. మండల పరిధిలోని గౌరారం ఉన్నత పాఠశాలలో దాతలు ఏర్పాటు చేసిన డిజిటల్ గదిని ప్రారంభించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఈలాంటి విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించడం ఇతరులకుఆదర్శమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదన్నారు.విద్యార్థులు బాగా చదివి పాఠశాల, తల్లిదండ్రులు, దాత లు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు.అనంతరం దాతల ను ఘనంగా సన్మానించారు.

# గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం...





**రాజేంద్రనగర్, మహా ;** గణేష్ నిమజ్జోత్సవానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కుంటలు, చెరువులను జిహెచ్ఎంసి, మున్సిపల్ , గ్రామపంచాయతీ, అధికారులు అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగాచేశారు. గణేష్ నవరాత్రుల్లో భాగంగా 3, 5, 7, 9 ,11, రోజులు పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనానికి చెరువులు, కుంటలు ముస్తాబ్ అయ్యాయి. పోలీసుల పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కుంటలు చెరువుల వద్ద ఐమాక్స్ వీధి దీపాలు, భారీ క్రేన్లను, జిహెచ్ఎంసి పరిశుద్ధ కార్మికులు, గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. భక్తుల కోసం నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ పరిధిలో గణేష్ నవరాత్రుల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్వాగత ప్లాట్ ఫామ్లు లో ఏర్పాటుచేసారు. నియోజకవర్గం పరిధిలో సుమారు 2500, వినాయకులు నవరాత్రులు పూర్తి చేసుకొని ఊరేగింపులతో నిమజ్జనానికి బయలుదేరుతాయి. ఐమాక్స్ లైట్లతో చెరువులు కుంటలు. నిమజ్జనానికి సుందరంగా తయారయ్యాయి. పోలీసులు కుంటలు చెరువుల వద్ద గుడారాలను ఏర్పాటు చేసుకొని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.